

ప్రతిభకు నిదర్శనం..పురస్కారాలు : సీఎం

బెంగళూరు, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): కర్ణాటక రాజ్యోత్సవ పురస్కారాలు సమాజంలో భిన్నమైన రంగాల్లో విజేతల ప్రతిభకు నిదర్శనంగా ఉన్నాయని సీఎం సిద్దరామయ్య అభిప్రాయపడ్డారు. 69మంది భిన్నమైన రంగాలలో సాధకులకు పురస్కారాలను ప్రదానం చేశారు. శుక్రవారం విధానసౌధ తూర్పు ద్వారం వద్ద ఏర్పాటైన కార్యక్రమంలో విధానపరిషత్ సభాపతి బసవరాజ హొరట్టి, డీసీఎం డీకే శివకుమార్, హోం మంత్రి పరమేశ్వర్, కన్నడ సంస్కృతి శాఖ మంత్రి శివరాజ్ తంగడగిలతోపాటు పలువురు పాల్గొన్నారు. 69మందికి రాజ్యోత్సవ పురస్కారాలను సీఎం ప్రదానం చేశారు.

కన్నడమాత భువనేశ్వరికి సీఎం పూజలు



కన్నడ భాషాభివృద్ధే లక్ష్యం



లేజర్ వెలుగుల్లో విధానసౌధ

- మాతృభాషను నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవు
- సీఎంగా అన్యాయం జరగనివ్వను
- రాజ్యోత్సవంలో ముఖ్యమంత్రి సిద్దరామయ్య

బెంగళూరు, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): కన్నడ భాషాభివృద్ధి, సంస్కృతి నిరంతర మనుగడ ప్రతి కన్నడిగుడి లక్ష్యం కావాలని సీఎం సిద్దరామయ్య పిలుపునిచ్చారు. భాషను అభివృద్ధి చేసి కన్నడిగులుగా గర్వపడదామని, కన్నడేతరులకు భాష నేర్పించే ప్రయత్నం ద్వారా కన్నడ వాతావరణాన్ని రాష్ట్రమంతటా విస్తృతం చేద్దామని పిలుపునిచ్చారు. శుక్రవారం విద్యాశాఖ ఆధ్వర్యంలో కంఠీరవ స్టేడియంలో 69వ కర్ణాటక రాజ్యోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు, ప్రజలను ఉద్దేశించి సీఎం సిద్దరామయ్య ప్రసంగిస్తూ కర్ణాటక రాష్ట్రం ఏకీకరణ జరిగి 68ఏళ్లు పూర్తి అయ్యిందన్నారు. మాతృభాష కన్నడను వ్యవహారికం చేయడంతోపాటు ఇతరులతోనూ కన్నడలోనే మాట్లాడేలా శపథం చేయాలన్నారు. కన్నడ భాషకు 2వేల సంవత్సరాల చరిత్ర ఉందని, అత్యంత ప్రాచీనమైన భాష అన్నారు. కన్నడకు శాస్త్రీయహోదా లభించిందన్నారు. భాషపట్ల అభిమానం పెంచుకోవాలని, ఇతరభాషలు నేర్చుకోవడ ం సమంజసమే అయినా తొలి ప్రాధాన్యం కన్నడకు ఉండాలన్నారు. మాతృభాషలో విద్య ఉత్తమమని మహాత్మాగాంధీ అభిప్రాయపడ్డారన్నారు. ఇటీవల సోషల్‌మీడియాలో భాష, సంస్కృతి పట్ల హేళన చేస్తున్నారని అటువంటివారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. దేశంలో అత్యంత ఎక్కువ పన్నులు వసూలయ్యే రెండో రాష్ట్రం కర్ణాటక అన్నారు. 4లక్షల కోట్ల రూపాయలకుపైగా పన్నులరూపంలో రాష్ట్రంనుంచి కేంద్రానికి వెళ్తోందని, అయితే రాష్ట్రవాటాలో రూ.50-60వేలు కోట్లు మాత్రమే వాపసు వస్తోందన్నారు. కేంద్రం నుంచి మనకు అన్యాయం జరుగుతోందని, న్యాయబద్ధమైన వాటా అడిగితే రాజకీయ రంగు పులుముతున్నారన్నారు. మన హక్కు కోసం పోరాడాల్సిన అవసరం వచ్చిందన్నారు. రాష్ట్రానికి చెందిన ఎంపీలు ఢిల్లీలో కన్నడిగుల ధ్వని కావాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో ప్రతిరోజూ 57లక్షలమంది పిల్లలకు పౌష్టికాహారం అందిస్తున్నామన్నారు. వారంలో ఆరు రోజుల పాటు గుడ్డు, చిక్కీ ఇస్తున్నామన్నారు. కార్యక్రమంలో విధానపరిషత్ సభాపతి బసవరాజ హొరట్టి, డీసీఎం డీకే శివకుమార్, విద్యాశాఖ మంత్రి మధుబంగారప్ప, చీఫ్ సెక్రటరీ శాలిని రజనీశ్, ఎమ్మెల్యేలు హారిస్, రిజ్వాన్ అర్షద్‌తో పాటు అధికారులు పాల్గొన్నారు. బెంగళూరు నగర పరిధిలోని వివిధ డివిజన్లనుంచి వేలాది మంది విద్యార్థులు పాల్గొని సాంస్కృతిక ప్రదర్శనలు ప్రదర్శించారు. రాష్ట్ర వ్యాప్తంగా రాజ్యోత్సవ సంబరాలు మిన్నంటాయి.

మైసూరు బ్యాంకు సర్కిల్లో..

మైసూరు బ్యాంకు సర్కిల్‌లో కన్నడ పోరాటనేత వాటాళ్ నాగరాజ్ సారథ్యంలో జరిగిన రాజ్యోత్సవ వేడుకల్లో సీఎం సిద్దరామయ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ తాను అధికారంలో ఉండగా కన్నడకు అన్యాయం జరగదన్నారు. మన భాష మరింత ఉన్నత శిఖరాలకు వెళ్లాలనేది నా ఆశయమన్నారు. వాటాళ్ నాగరాజ్ దశాబ్దాలకాలం భాష, సంస్కృతి కోసం పోరాటం చేశారని ఎప్పుడూ అధికారం కోసం ప్రాకులాడలేదన్నారు. నాతోపాటు ఎంతోమంది రాజకీయదిగ్గజాలకు ఆప్తుడన్నారు. భాష, నేల, నీరు విషయంలో ఆయనది రాజీలేని పోరాటమని కొనియాడారు.



జాతీయ, కన్నడ పతాకాలకు సీఎం గౌరవవందనం



డోలు వాయించి సంబరాలను ప్రారంభిస్తున్న సీఎం సిద్దరామయ్య, డీసీఎం డీకే శివకుమార్ తదితరులు

కన్నడలో ప్రధాని శుభాకాంక్షలు

బెంగళూరు, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): కన్నడ రాజ్యోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్ర వ్యాప్తంగా సంబరాలు సాగుతున్నాయి. ప్రధానమంత్రి నరేంద్రమోదీ 'ఎక్స్' ద్వారా రాజ్యోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. కన్నడ భాషలోనే శుభాకాంక్షలు తెలిపి అందరినీ ఆశ్చర్యపరిచారు. కర్ణాటక సంస్కృతి సంప్రదాయాలను గుర్తు చేస్తూ ఎందరో మహనీయులు పలు రంగాలలో అభివృద్ధి, ఆధునికశక్తిని నింపారన్నారు. రాష్ట్ర ప్రజలు నిరంతరం సంతోషంగా ఉండాలని అభిలాషించారు. కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే రాష్ట్ర ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. కన్నడ నాడు, నుడి, సంస్కృతి చరిత్ర, పారంపర్యం నిరంతరం వెలగాలని సమృద్ధ కన్నడనాడు నిర్మితం కావాలని రాష్ట్ర ప్రజలకు కన్నడ శుభాకాంక్షలంటూ ఎక్స్‌లో పోస్ట్ చేశారు.



అదుపు తప్పి చెరువులో పడిన కారు

- ముగ్గురు యువకుల మృత్యువాత

హోసూరు(క్రైం) నవంబరు 1(ఆంధ్రజ్యోతి): కారు అదుపు తప్పి చెరువులో పడడంతో ముగ్గురు యువకులు మృత్యుపాలయ్యారు. హోసూరు సమీపంలో వెళ్తున్న కారు అకస్మాత్తుగా చెరువులో పడిపోవడంతో ఈ ప్రమాదం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు హోసూరు ఉమాశంకర్ నగర్‌కు చెందిన మహేశ్ (25) బెంగళూరులో ఐటీ ఉద్యోగిగా పనిచేస్తున్నాడు. ఇతని స్నేహితులు హోసూరు ఆవలపల్లి రోడ్డు జీకేడీ నగర్‌కు చెందిన లింజో (25), హోసూరు చిన్నయలసగిరి కి చెందిన యోగేశ్వరన్(25)తో కలసి ముగ్గురూ బుధవారం కారులో వచ్చారు. హోసూరు సమీపంలోని బాగలూరు సమీపంలోని వెంకటాపురం చెరువు పక్కన వెళ్తుండగా కారు అదుపు తప్పి చెరువులో పడింది. గమనించిన స్థానికులు వెంటనే బాగలూరు పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు స్థానికుల సహాయంతో క్రేన్‌తో కారును బయటకు తీశారు. మహేశ్, లింజోల మృతదేహాలు బయటికి తీసి పోస్టుమార్టం నిమిత్తం హోసూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. యోగేశ్వరన్ మృతదేహాన్ని శుక్రవారం ఉదయం వెలికితీశారు. అనంతరం మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం హోసూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. బాగలూరు నుంచి వెంకటాపురం వెళ్లే మార్గంలో ఈ చెరువు ఇటీవల కురిసిన వర్షాలకు పూర్తిగా నీటితో నిండింది. అయితే రోడ్డుకు ఇరువైపులా ఎలాంటి అడ్డు గోడలు లేకపోవడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



కారులో యువకులు (ఫైల్)

ముడా ఇంటి స్థలం రద్దుకు బీజేపీ ఎమ్మెల్యే వినతి

- ఆమోదించాలని ముఖ్యమంత్రి సిఫారసు
- స్థలాలు పొందిన వారందరిలోనూ ఆందోళన

బెంగళూరు, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): మైసూరు నగరాభివృద్ధి ప్రాధికార (ముడా) నుంచి పరిహారం రూపంలో పొందిన ఇంటిస్థలం రద్దు చేయాలంటూ మైసూరు నగర కృష్ణరాజ నియోజకవర్గం బీజేపీ ఎమ్మెల్యే శ్రీవత్స నేరుగా ముఖ్యమంత్రి సిద్దరామయ్యకు ప్రత్యేకంగా లేఖ రాశారు. అందుకు సీఎం కూడా ఆమోదించేలా చర్యలు తీసుకోవాలంటూ నగరాభివృద్ధి శాఖ కార్యదర్శికి లిఖిత పూర్వకంగా సూచించారు. ముడా ఇంటి స్థలాల పంపిణీలో అవినీతి జరిగిందనే ఆరోపణలతో సీఎం సిద్దరామయ్యపై కేసు నమోదు కాగా విచారణకు సిద్ధమైన సంగతి తెలిసిందే. ఇటీవలే సీఎం సిద్దరామయ్య భార్య పార్వతికి కేటాయించిన 14 ఇంటి స్థలాలను వాపసు చేసిన విషయం తెలిసిందే. మరో వైపు ఇదే కేసులో ఈడీ అధికారులు సీఎం సిద్దరామయ్యకు ఆప్తులతో పాటు ముడా మాజీ కమిషనర్ నివాసాలపైనా దాడులు చేశారు. ఇదిలా ఉండగానే మైసూరు కృష్ణరాజ బీజేపీ ఎమ్మెల్యే టీఎస్ శ్రీవత్స 2020వ ఏడాది 50:50 నిష్పత్తిన పొందిన ముడా ఇంటి స్థలాన్ని రద్దు చేయించాలని కోరుతూ ఏకంగా ముఖ్యమంత్రికి లేఖ రాయడం అవినీతికి కొత్త మలుపు వచ్చినట్లు అయ్యింది.

మంత్రి మహదేవప్ప కుటుంబికులకు...

ముడా ఇంటిస్థలాల వివాదంలో సీఎం సిద్దరామయ్య భార్య పార్వతితో పాటు బావమరిది మల్లికార్జునస్వామి లోకాయుక్త విచారణలు ఎదుర్కొన్నారు. సీఎంపై లోకాయుక్తకు ఫిర్యాదు చేసిన సామాజిక కార్యకర్త స్నేహమయి కృష్ణ మరో ఆరోపణ చేశారు. సీఎం సిద్దరామయ్యకు ఆప్తుడైన మైసూరు జిల్లాకు చెందిన సాంఘిక సంక్షేమశాఖా మంత్రి మహదేవప్ప సోదరుడి కుమారుడు నవీన్‌బోస్‌కు సెటిల్‌మెంట్ డీడ్ కింద ఇంటి స్థలం కేటాయించినట్లు ఫిర్యాదు చేశారు. దీంతో విచారణ కొనసాగిస్తే మంత్రి మహదేవప్ప కుటుంబానికి ముడా వివాదం చుట్టుకునే ప్రమాదం ఉంది. ఇప్పటికే స్థలాలు పొందిన వారిలో ఆందోళన మొదలయ్యింది.

రాజకీయ కుట్రలకు బలయ్యాను..!

- మాజీ ప్రధాని మనవడు, కేంద్రమంత్రి కుమారుడిని కావడం దురదృష్టం : ప్రచారంలో నిఖిల్ కంటతడి

బెంగళూరు, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): రాజకీయ కుట్రలకు బలి అయ్యానని వరుసగా రెండుసార్లు ఓటమి చెందానని, తానేం తప్పు చేశానో తెలియదని, మాజీ ప్రధాని దేవెగౌడ మనవడు కావడం, మాజీ సీఎం, కేంద్ర మంత్రి కుమారస్వామి కుమారుడు కావడమే దురదృష్టమని చన్నపట్టణ జేడీఎస్-బీజేపీ ఉమ్మడి అభ్యర్థి నిఖిల్ కంటతడి పెట్టారు. చన్నపట్టణ నియోజకవర్గం కెన్నమంగలలో గురువారం ప్రచారంలో ఆయన మాట్లాడారు. రెండు ఎన్నికల్లో ఓడిపోయానని, ప్రజలు తనకు ఓటు వేశారని, అయినా రాజకీయ కుట్రలకు బలి అయ్యానన్నారు. రెండుసార్లు ఓటమితో తీవ్రంగా బాధపడ్డానని, పార్టీ కార్యకర్తలకు కృతజ్ఞతలు చెప్పేందుకే ప్రస్తుత ఉప ఎన్నికల్లో పోటీ చేశానన్నారు. యువకుడిని గెలిపించాలని, మీ కుటుంబ సభ్యుడిగా భావించాలని భావోద్వేగానికి లోనయ్యారు. ప్రస్తుత ఎన్నికల ప్రచారంలో భావోద్వేగానికి లోను కాకూడదని, కంటతడి పెట్టరాదని భావించానని, అయితే మనసులోని కొన్ని భావాలను వ్యక్తం చేయకుండా ఉండలేకపోతున్నానన్నారు. మండ్య లోక్‌సభ ఎన్నికలవేళ ఎన్నో మానసికబాధలు ఎదుర్కొన్నానన్నారు. ప్రాంతీయ పార్టీ కొనసాగించడం అంత సులువు కాదన్నారు. అయితే రైతుల కోసం అన్నదాతల ధ్వనిగా ఉండాలని మాజీ ప్రధాని దేవెగౌడ నిరంతరంగా రాజకీయ పోరాటం చేశారన్నారు. అదే విధానం కుమారస్వామి కొనసాగించారన్నారు.



మాట్లాడుతున్న నిఖిల్

బీజీఎస్ ఆసుపత్రిలో నటుడు దర్శన్

బెంగళూరు, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): చిత్రదుర్గ రేణుకాస్వామి హత్యకేసులో ఆరోగ్యసమస్యలతో బెయిల్‌పై విడుదలైన నటుడు దర్శన్ శుక్రవారం ఆసుపత్రిలో చేరారు. బుధవారం దర్శన్ బెయిల్‌పై విడుదల కాగా గురువారం ఇంటిపట్టునే విశ్రాంతి తీసుకున్నారు. శుక్రవారం మధ్యాహ్నం బెంగళూరు శివారు కెంగేరిలోని బీజీఎస్ గ్లెనిగల్ ఆసుపత్రిలో చేరారు. దర్శన్ ఆసుపత్రిలో చేరిన విషయం తెలియగానే కెంగేరి ప్రాంతానికి వేలాదిమంది అభిమానులు తరలివచ్చారు. ఆసుపత్రి వద్ద ఇతర రోగులకు అంతరాయం కలగకుండా ఉండాలని భావించి కేఎస్ఆర్‌పీ ఒక ప్లటూన్‌తోపాటు 50మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేశారు. ఎంఆర్ఐ, సిటీస్కాన్, రక్తపరీక్షలతోపాటు కాలేయానికి సంబంధించిన వైద్య నిపుణులు దర్శన్‌కు పరీక్షలు చేసేందుకు సిద్ధమయ్యారు. మరోవైపు బళ్ళారిలో ఆయనకు పరీక్షలు జరిపిన మైసూరు వైద్యుల సలహాలను బీజీఎస్ వైద్యులు తీసుకున్నట్లు తెలుస్తోంది. 2013లో బృందావన సినిమా షూటింగ్ వేళ గుర్రపు స్వారీ చేస్తూ దర్శన్ కిందపడ్డాడు. అప్పట్లో బీజీ ఎస్ ఆసుపత్రిలోనే చికిత్స పొందారు. 11ఏళ్ల తర్వాత వెన్నునొప్పి చికిత్స కోసం మళ్లీ బీజీఎస్‌లో చేరారు. అభిమానులను అదుపు చేయడం పోలీసులకు సవాల్‌గా మారింది.

నగరం.. వాహనాలమయం..!

- బెంగళూరులో పెరిగిపోతున్న వాహనాలు
- రాష్ట్రమంతటా ముగ్గురికి ఒకటి చొప్పున..
- ప్రజారవాణాపై ఆసక్తి కరువు

బెంగళూరు, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): ఐటీ నగరి బెంగళూరులో పది కిలోమీటర్లు ప్రయాణించాలంటే ఎంత సమయం రోడ్డుపై గడపాలో అందరికీ తెలిసిందే. ట్రాఫిక్ జామ్‌తో వాహనదారులు బెంబేలెత్తాల్సిన పరిస్థితి నెలకొంది. అయితే ఇంతటి ట్రాఫిక్ కష్టాలకు వాహనాల సంఖ్య పెరిగిపోవడమే ప్రధాన కారణమని అందరికీ తెలిసిందే.బెంగళూరులో ప్రజల సంఖ్యతో సమానంగా సొంతవాహనాలు కలిగి ఉన్నాయని తేలడం ఆశ్చర్యం కలిగిస్తోంది. నగరంలో జనాభా పెరుగుతున్నట్టే వాహనాలసంఖ్య కూడా గణనీయంగా అధికమవుతున్నాయి. రాష్ట్రంలో ప్రజారవాణాపై ప్రజల్లో ఆసక్తి తగ్గిపోతోంది. సొంత వాహనాలు ఉపయోగించేవారి సంఖ్య క్రమంగా అధికమవుతోంది. కొత్తగా వాహనాల కొనుగోలు చేసేవారు పెరిగిపోతున్నారు. దశాబ్దకాలంగా వాహనాల కొనుగోళ్లు మూడింతలు పెరిగాయి. ప్రజల్లో సొంత వాహనంపై ఆసక్తి పెరిగిపోతోంది. మారుమూల గ్రామాలకు సైతం కొత్త వావాహనాలు, కార్లు, బైక్‌లు చేరుతున్నాయి.

● వాహన సంఖ్య పెరగడానికి ముఖ్యంగా బ్యాంకులు, ఫైనాన్స్ సంస్థలు వెహికల్‌లోన్స్ సరళీకృతం చేయడం..పోటాపోటీగా రుణాలు ఇవ్వడంతో వాహనాల సంఖ్య పెరిపోయింది. దీంతో సొంతకారు, బైక్ కొనుగోలుకు ప్రజలు ఆసక్తి చూపుతున్నారు. ప్రతి ఒక్కరికీ వాహనాల కొనుగోళ్లపై వ్యామోహం పెరిగిపోతోంది. ఒక ఇంట్లో ఒక కారు, ఒక బైక్ అనేది పాతమాటగా మారింది. ప్రతి ఇంటికి 2-3 ద్విచక్రవాహనాలు, ఒకటి రెండు కార్లు కలిగి ఉండడం సాధారణమైపోతోంది. స్థానికంగా తిరిగేందుకు ఒక కారు, సుదూరం వెళ్లేందుకు మరో కారు అనేలాంటివారు పెరిగారు. కొత్తకార్లు, బైక్‌లు మార్కెట్‌లోకి వస్తే చాలు ఫీచర్‌లు బాగున్నాయని ఎగబడుతున్నారు. మరోవైపు బెంగళూరులో ఎలక్ట్రికల్ వాహనాల కొనుగోళ్లు కూడా పెరిగాయి.

● రాష్ట్రంలో 2013-14లో సుమారు 1.63 కోట్ల వాహనాలు ఉండేవి. 2024 ఆగస్టు ఆఖరునాటికి దాదాపు రెట్టింపుకు చేరి 3.27 కోట్లకు పెరిగాయి. కొత్త వాహనాలు కొనుగోళ్ల 130శాతం పెరిగినట్లు తెలుస్తోంది. ద్విచక్రవాహనాల సంఖ్య గణనీయంగా పెరిగింది. ఆ తర్వాతి స్థానంలో కార్లు, ఆటోలు ఉన్నాయి. రాష్ట్రఖజానాకు ఎక్కువ ఆదాయం తీసుకొచ్చే విభాగాలలో మోటారువాహనాల శాఖ కూడా ఒకటిగా ఉంది. అయితే వాహనాల సంఖ్య పెరుగుతుండడంతోనే నగరంలో ట్రాఫిక్ సమస్య తీవ్రమవుతోంది. దీనికితోడు పర్యావరణం పై కూడా ప్రభావం పెరుగుతోంది.

రాష్ట్రంలో వాహనాలసంఖ్య

సంవత్సరం	కోట్లలో
2011-12	1.35
2015-16	1.95
2020-21	2.72
2023-24	3.03
2024-25	3.277

పలు జిల్లాల్లో పెరుగుతున్న వాహనాలు

● పదేళ్లలో ఐటీ నగరి బెంగళూరుతో పాటు రాష్ట్రంలోని ఇతర జిల్లాల్లోనూ మూడింతల వాహనాలు పెరిగాయి. బెంగళూరులో 2013-14నాటికి 60లక్షల వాహనాలు ఉండేవి. ప్రస్తుతం 1.20కోట్ల వాహనాలకు చేరాయి. బెంగళూరులో నివసించే ప్రతి ఒక్కరికి సరాసరిన ఒక వాహనం ఉంది. ఇక రాష్ట్రంలో ప్రతి ముగ్గురిలో ఒకరికి వాహనం ఉంది. బెంగళూరులో జనాభాను పోలిస్తే కొంత వాహనాల సంఖ్య కొన్ని ప్రాంతాల్లో అధికమనిపిస్తోంది. బెంగళూరు వ్యాప్తంగా ప్రతిరోజూ అన్ని వాహనాల రిజిస్ట్రేషన్‌లు కలిపితే 6వేలకుపైగా ఉంటున్నాయి. ఇదే తరహాలో వాహనాల కొనుగోళ్లు సాగితే రానున్న ఐదేళ్లలో ప్రజలకంటే వాహనాల సంఖ్య అధికం కానుంది.

● రాష్ట్రంతోపాటు బెంగళూరులో వాహనాల సంఖ్య పెరిగేందుకు ప్రజల ఆదాయం పెరగడం, మౌలిక సదుపాయాలు మెరుగు కావడం వంటివి ఉన్నాయి. ద్విచక్రవాహనాలు, కార్లు కలిగి ఉండడం అత్యవసరమనే మనఃస్థితి పెరగడం కూడా కీలకమే. కొవిడ్ వేళ ప్రజారవాణా ప్రమాదకరమని భావించి సొంత వాహనాల కొనుగోళ్లకు ఎక్కువమంది మొగ్గు చూపారు. ఒకసారి సొంత వాహనాలకు అలవాటు పడితే ప్రజారవాణా పట్ల ఆసక్తి తగ్గిపోతుంది. నగరంలో ప్రజారవాణాతోపాటు మెట్రో, క్యాబ్‌లు, ఆటోలు, బైక్‌ట్యాక్సీలు పుష్కలంగా అందుబాటులో ఉన్నాయి. ఆటోలు లక్షల సంఖ్యలో ఉన్నా క్యాబ్‌లు ఏమాత్రం తీసిపోలేదనే రీతిలో అందుబాటులో ఉన్నాయి. మెట్రో సేవలు విస్తృతం చేసినా సుదూర ప్రాంతాలవారు సద్వినియోగం చేసుకుంటున్నారు. నగరంలో ట్రాఫిక్ సమస్య పెనుసవాల్‌గా నానాటికీ మారిపోతోంది.



మైసూరు రోడ్డులో ట్రాఫిక్ జామ్

లైదారుల్లో ఇక పరుగులు

గ్రామీణ రోడ్లకు నూతన శోభ

గ్రామీణ రహదారుల్లో ఇక పరుగులు తీయవచ్చు. నిన్నటి వరకూ గుంతలమయమై రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడ్డ గ్రామీణులు నూతన రహదారులతో సులభంగా ప్రయాణం చేయవచ్చు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పల్లె పండుగ కార్యక్రమం జిల్లాలో శరవేగంగా జరుగుతోంది. వర్షాలు కురిసినా ఎక్కడా సీసీరోడ్లు, బీటీ రోడ్ల పనులు ఆపలేదు. అధికారులు, ప్రజా ప్రతినిధులు ఎక్కడికక్కడ రోడ్ల నిర్మాణానికి భూమి పూజలు చేశారు. పల్లె రోడ్లకు కూటమి ప్రభుత్వం జిల్లాలో రూ. 100 కోట్లు కేటాయించి 1521 రోడ్లకు శ్రీకారం చుట్టింది. ఇందులో సీసీ రోడ్లు 1515, బీటీ రోడ్లు 6 ఉన్నాయి. ఇప్పటికే వెయ్యికి పైగా రోడ్ల పనులను ప్రారంభించారు. -ఆంధ్రజ్యోతి, అనంతపురం సిటీ

- వారం రోజుల్లోనే 70 శాతం పనులు ప్రారంభం
- సంక్రాంతికి పూర్తి చేయడమే లక్ష్యం
- రోడ్లను విస్మరించిన వైసీపీ

పల్లె పండుగలో రాజీవ్‌కాలనీలో సీసీ రోడ్డు వేస్తున్న దృశ్యం



పల్లె రోడ్లను విస్మరించిన వైసీపీ

గత ఐదేళ్ల పాలనలో వైసీపీ పల్లె రోడ్లను ఏమాత్రం పట్టించుకోలేదు. కనీసం మరమ్మతులు కూడా చేయని దుస్థితి. తద్వారా ఎక్కడికక్కడ రోడ్లు అధ్వానస్థితికి చేరి ఆయా ప్రాంతాల ప్రజలు అవస్థల నడుమ రాకపోకలు సాగించాల్సిన దుస్థితి నెలకొంది. వర్షాలు కురిసిన సమయాల్లో అడుగు తీసి అడుగు వేయలేని పరిస్థితి. మరికొన్ని ప్రాంతాల్లో గుంతల రోడ్లతో తీవ్ర ఇబ్బందులు పడేవారు.

సందడిగా ప్రారంభం

అనంతపురం జిల్లాలోని ఏడు నియోజకవర్గాల పరిధిలో రోడ్డు పనులను సందడిగా ప్రారంభించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే.. పల్లె రోడ్లకు రూ.100 కోట్ల నిధులను మంజూరు చేశారు. దీంతో అక్టోబరు 14 నుంచి ఆయా ప్రాంతాల్లో మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, ప్రజాప్రతినిధులు రోడ్లకు భూమి పూజలు చేశారు. వారం రోజుల్లోనే 1521 రోడ్లలో 1000 రోడ్లకు పైగా (70శాతం) పనులకు భూమి పూజ చేశారు. ఈ పనులన్నింటినీ సంక్రాంతి పండుగలోపు పూర్తి చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. ఆ దిశగా ఆ శాఖ అధికారులు, సిబ్బంది పనులను పర్యవేక్షిస్తున్నారు. రోడ్లన్నీ పూర్తయితే సంక్రాంతికి పల్లె రహదారులకు నూతన శోభ రానుంది.



వేగంగా పనులు చేయిస్తున్నాం

ప్రభుత్వ ఆదేశాలు మేరకు.. మంజూరు చేసిన నిధులతో జిల్లా వ్యాప్తంగా సీసీ, బీటీ రోడ్ల పనులను వేగవంతంగా చేయిస్తున్నాం. ప్రణాళికాబద్ధంగా పనులను చేయిస్తున్నాం. ఎక్కడా నాణ్యత తగ్గకుండా చూస్తున్నాం. రోడ్లన్నీ పూర్తయితే పల్లె ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది.

- జహీర్ అస్లాం, ఎస్ఈ, పంచాయతీ రాజ్‌శాఖ

రోజువారీగా సమీక్షిస్తున్నాం

పల్లె పండుగ కార్యక్రమంలో చేస్తున్న పనులపై ప్రతిరోజూ ఆరా తీసి వేగంగా పనులు జరిగేలా చూస్తున్నాం. మంత్రులు, ఎమ్మెల్యేలతో భూమి పూజ చేయించి పనులను ప్రారంభించాం. లక్ష్యం ప్రకారం సంక్రాంతి పండుగ లోపు జిల్లాలో రోడ్ల పనులను పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తెచ్చే విధంగా చూస్తాం.

- ప్రభాకర్‌రెడ్డి, ఈఈ, పంచాయతీ రాజ్‌శాఖ



అధికారుల అత్యుత్సాహం

- పంచాయతీ కార్యదర్శులకు తిప్పలు
- గాలిలో 73 మంది కార్యదర్శులు
- వేతనాలు అందక లబోదిబో
- పట్టించుకోని ఉన్నతాధికారులు



డీపీఓ కార్యాలయం

అనంతపురం న్యూటౌన్, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): జిల్లా పంచాయతీ కార్యాలయ అధికారుల అత్యుత్సాహంతో పలువురు పంచాయతీ కార్యదర్శులకు తిప్పలు తప్పడం లేదు. గత ప్రభుత్వం చేసిన తప్పిదాల వల్ల కార్యదర్శులు వేతనాలు అందక లబోదిబోమంటున్నారు. ఉన్నతాధికారులు తమ స్థానాన్ని పదిలం చేసుకోవడానికి నాడు రాజకీయ సిఫార్సులకు తలొగ్గి సమస్యలు తెచ్చిపెట్టి ఆఖరికి గాలిలో నిలబెట్టారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. వైసీపీ రాక ముందు పంచాయతీల్లో గ్రేడ్-1 నుంచి గ్రేడ్-4 వరకు నాలుగు గ్రేడ్స్‌లో కార్యదర్శులు ఉండేవారు. వైసీపీ ప్రభుత్వం ఏర్పడిన తరువాత సచివాలయ వ్యవస్థలో భాగంగా గ్రేడ్-5, గ్రేడ్-6 కార్యదర్శుల నియామకానికి శ్రీకారం చుట్టింది. నూతనంగా నియమితులైన వారికి అప్పటికే గ్రేడ్-4 వరకు ఉన్న కార్యదర్శులతో సమానంగా డీడీఓ పవర్స్ ఇచ్చి ప్రతి పంచాయతీకి ఒక కార్యదర్శి ఉండేలా చర్యలు తీసుకోవడంతో సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. పంచాయతీల సంఖ్య కంటే కార్యదర్శులు ఎక్కువగా ఉండడంతో కొందరు కార్యదర్శులు గ్రేడ్స్‌కు అతీతంగా గాలిలో ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. ఉమ్మడి జిల్లాలో 1044 పంచాయతీలు ఉన్నాయి. వీరిలో గ్రేడ్-1 నుంచి గ్రేడ్-4 వరకు 605 మంది ఉన్నారు. సచివాలయ కార్యదర్శులు గ్రేడ్-5కు 512 మంది ఎంపికయ్యారు. దీంతో కార్యదర్శుల సంఖ్య 1117కు చేరింది. జిల్లాలో పంచాయతీల సంఖ్య కంటే 73 మంది అదనంగా ఉన్నారు. వీరిలో చాలా మందికి ప్లేస్‌మెంట్స్ లేకపోవడంతో వేతనం మంజూరు కాని పరిస్థితి ఏర్పడింది. జిల్లా పంచాయతీ కార్యాలయ సిబ్బంది నానాతంటాలు పండి కొంత మందికి వెసులుబాటు కల్పించారు. మిగిలిన వారి పరిస్థితి అయోమయంగా ఉంది. గతంలో బదిలీల ప్రక్రియ చేపట్టిన అధికారులు ప్రస్తుతం లేరు. ప్రస్తుత డీపీఓ నుంచి మిగిలిన సిబ్బంది అందరూ కొత్తవారు కావడంతో గతంలో చేసిన తప్పిదాలను తామెందుకు సరిదిద్దాలన్న ఉద్దేశంతో వ్యవహరిస్తున్నారన్న విమర్శలున్నాయి. నూతన డీపీఓ నాగరాజనాయుడు స్పందించి తమ సమస్యను పరిష్కరించాలని బాధిత కార్యదర్శులు కోరుతున్నారు.

టమోటా కిలో రూ.23

అనంతపురం రూరల్, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): కక్కలపల్లి టమోటా మార్కెట్‌లో కిలో టమోటా గరిష్ఠంగా రూ.23తో అమ్ముడుపోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రాంప్రసాద్ తెలిపారు. శుక్రవారం 675 టన్నుల టమోటా దిగుబడులు వచ్చాయన్నారు. కిలో సరాసరి ధర రూ.18, కనిష్ఠ ధర రూ.13 పలికినట్లు ఆయన తెలిపారు.

రిజర్వేషన్ బుకింగ్ నూతన విధానం ప్రారంభం

గుంతకల్లు, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): రైల్వేలో రిజర్వేషన్ టికెట్ 60 రోజుల ముందు నుంచి అడ్వాన్స్ బుకింగ్ చేసుకునే నూతన విధానం శుక్రవారం ప్రారంభమైంది. నిన్నటి వరకూ 120 రోజుల ముందు టికెట్ రిజర్వేషన్ చేసుకునే విధానం (అడ్వాన్స్ రిజర్వేషన్ పీరియడ్) అమల్లో ఉండేది. రైల్వే మంత్రిత్వశాఖ 120 రోజుల ముందు రిజర్వేషన్ చేసుకునే కాల పరిమితిని సగానికి కుదించి 60 రోజుల ముందు నుంచే రిజర్వేషన్ చేసుకునే విధంగా నిబంధనలను మార్చడానికి గత నెలలో నిర్ణయించింది. ట్రెయిన్ బెర్త్ రిజర్వేషన్‌లో జరుగుతున్న అక్రమాలను తొలగించడం కోసం ఈ విధానాన్ని అమలులోకి తెస్తున్నట్లు రైల్వే శాఖ పేర్కొంది. ఈ మేరకు నవంబరు 1వ తేదీ నుంచి మార్పుచేసిన విధానం అమల్లోకి వచ్చింది.

1085 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

బెళుగుప్ప, నవంబరు 1(ఆంధ్రజ్యోతి) : మండలంలోని జీడిపల్లి రిజర్వాయర్‌కు శుక్రవారం కృష్ణాజలాల ఇన్‌ఫ్లో 1085 క్యూసెక్కులు వస్తున్నట్లు హంద్రీనీవా అధికారులు తెలిపారు. అలాగే ఔట్‌ఫ్లో కింద హెచ్ఎన్ఎస్ఎస్ ఫేజ్-2కు 1,079 క్యూసెక్కులు వెళుతోందన్నారు. ప్రస్తుతం 1.664 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు.

ఖాకీ వెన్నులో వణుకు

గ్యాంగ్ రేప్ కేసు నిందితులను లోతుగా విచారించిన ఉన్నతాధికారులు

- పలువురు పోలీసు సిబ్బంది సహకారాన్ని బయటపెట్టినట్లు సమాచారం
- ఆ శాఖలో కలవరం
- జాబితాలో తామున్నామా అంటూ ఆరా..
- సస్పెన్షనా.. బదిలీనా.. అని చర్చ
- పురంలో హాట్ టాపిక్‌గా విచారణ

చిలమత్తూరు మండలంలో గ్యాంగ్‌రేప్ కేసులో నిందితులు, మోస్ట్‌వాంటెడ్ అంతర్రాష్ట్ర దొంగలను ఉన్నతాధికారులు లోతుగా విచారించడం ఖాకీల వెన్నులో వణుకు పుట్టిస్తోంది. నిందితులపై పదుల సంఖ్యలో చోరీలు, దోపిడీలు, అత్యాచారం కేసులున్నా, వారు దర్జాగా బయట ఎలా తిరుగుతున్నారన్న దానిపై ఉన్నతాధికారులు కూపీ లాగినట్లు తెలిసింది. ఇందులో తమకు సహకరించిన పోలీసుల బండారాన్ని నిందితులు బయటపెట్టినట్లు సమాచారం. వారు చెప్పిన విషయాలు విని, పోలీసు ఉన్నతాధికారులే విస్మయం వ్యక్తం చేస్తున్నట్లు చర్చ సాగుతోంది. నిందితులు వెల్లడించిన మేరకు వారికి ప్రత్యక్షంగా, పరోక్షంగా సహకరించిన పోలీసు సిబ్బంది వెన్నులో వణుకు పుడుతోంది. ఈ నేపథ్యంలో కొంతమందిపై వేటు పడే అవకాశం ఉంది. ఇదే హిందూపురంలో ప్రస్తుతం పోలీసు శాఖలో హాట్‌టాపిక్‌గా మారింది.



హిందూపురం, నవంబరు 1(ఆంధ్రజ్యోతి) ఇటీవల సంచలనం రేకెత్తించిన సామూహిక అత్యాచారం కేసులో పట్టుబడిన నిందితులు పేరుమోసిన, మోస్ట్ వాంటెడ్ అంతర్రాష్ట్ర నేరస్తులు. దీంతో పోలీసు ఉన్నతాధి కారులు.. వారిని అదుపులోకి తీసుకుని, సామూహిక అత్యాచారం కేసుతోపాటు పాత వాటిపై లోతుగా విచారించినట్లు తెలిసింది. నిందితులు కొన్నేళ్లుగా దోపిడీలు, అత్యాచారాలు, చోరీలు చేస్తుండడం, పోలీసులకు పట్టుబడినా జైలు నుంచి వచ్చి మళ్లీ కొనసాగిస్తుండటంపై ఉన్నతాధికారులకు అనుమానం వచ్చి రహస్యంగా విచారణ చేపట్టారు. పోలీసు సిబ్బందిపైనే దిమ్మతిరిగే విషయాలను నిందితులు ఉన్నతాధికారులకు చెప్పడంతో వారు నివ్వెరపోయినట్లు తెలిసింది. అందుకే ఇన్నేళ్లపాటు పేరుమోసిన దొంగలు, అంతర్రాష్ట్ర ముఠా హిందూపురంలో దర్జాగా తిరుగుతున్నట్లు వెల్లడైందని సమాచారం. వారికి కొంతమంది పోలీసు సిబ్బంది సలాం కొట్టడం, వారితోనే చేతులు కలపడం వెరసి నిందితులు అత్యాచారాల వైపు వెళ్లారని పోలీసు ఉన్నతాధికారులు భావిస్తున్నారు.



లోతుగా విచారించిన ఉన్నతాధికారులు

సామూహిక అత్యాచారం కేసులో పట్టుబడిన నిందితులు పాత నేరస్తులు కావడంతో వారిని పలు కేసుల్లో విచారించారు. అందులో గంజాయి, కొత్తరకం డ్రగ్స్, అత్యాచారాలు, దోపిడీలు, చోరీలపై ఆరాతీశారు. ఇన్ని కేసుల్లో నిందితులై ఉండి దర్జాగా ఎలా బయట తిరుగుతున్నారని ఓ ఉన్నతాధికారి ప్రశ్నించగా.. అప్పుడు కొంతమంది సిబ్బంది బాగోతం బయటపెట్టినట్లు తెలిసింది. నిందితులు పట్టుబడినపుడు వారిని బయటకు తీసుకురావడానికి కొంతమంది గ్రూపుగా ఏర్పడి, బెయిల్‌కు కావాల్సిన ఖర్చు భరించేవారని పోలీసు విచారణలో వెల్లడించినట్లు సమాచారం. నిందితులు బయటకు వచ్చాక మరో నేరం చేసి బెయిల్‌కు పెట్టిన ఖర్చుకు రెండింతలు ఇచ్చేవారని సమాచారం. ఈ బెయిల్‌కు బయట నుంచి సహకరించేవారిలో ఒకరిద్దరికి బంగారు వ్యాపారులతో సత్సంబంధాలున్నట్లు సమాచారం. వారు బయటకు వచ్చాక మరో చోరీగానీ, నేరంగానీ తద్వారా వచ్చిన సొమ్ములో నిందితులకు ఇచ్చేది కొంతే. మిగిలింది మొత్తం బెయిల్‌కు ఖర్చుపెట్టిన వారికే ఇవ్వాల్సి వచ్చేదని విచారణలో ఒప్పుకున్నట్లు సమాచారం. అంతేకాక పోలీసు సిబ్బంది కూడా నిందితులకు పరోక్షంగా, ప్రత్యక్షంగా సహకరించినట్లు ఉన్నతాధికారుల దృష్టికి వచ్చింది.

జాబితాలో మేమున్నామా?

సామూహిక అత్యాచారం కేసు నిందితులను ఉన్నతాధికారులు విచారించిన సమయంలో వారు కొంతమంది పోలీసు సిబ్బంది పేర్లు వెల్లడించినట్లు తెలిసింది. అత్యాచారం కేసులో పట్టుబడిన ఒకరిద్దరు నిందితులు గతంలో హిందూపురం మండలంలో జరిగిన ఓ కీలక కేసులో తమను తప్పించినట్లు ఉన్నతాధికారికి లిఖితపూర్వకంగా సమాచారం ఇచ్చినట్లు సమాచారం. వారు చెప్పిన జాబితాలో హిందూపురంలోని మూడు పోలీసు స్టేషన్ల పరిధిలో ఆరేడుగురి సిబ్బంది వ్యవహారాలు బట్టబయలు చేసినట్లు సమాచారం. నిందితులు చెప్పిన జాబితాలో తామున్నామా అంటూ పోలీసు సిబ్బంది చర్చించుకుంటున్నారు. వారు చెప్పిన జాబితాలో ఉన్న సిబ్బంది ఇప్పటికే తమపై వేటు పడుతుందని అంచనాకు వచ్చేశారు. దీంతో తాము హిందూపురం వదిలి వేరే చోటికి వెళ్లడానికి సిద్ధంగా ఉన్నామని ముందుగానే చెప్పుకుంటున్నారు. నిందితులకు సహకరించిన ఒకరిద్దరు కానిస్టేబుళ్లు తమ విషయం ఎలాగూ బయటకు వస్తుందన్న ఉద్దేశంతో ఒకరిద్దరు అధికారులు, మరికొంత సిబ్బంది మీద ఉన్నతాధికారికి వాట్సాప్ ద్వారా మెసేజ్ చేసినట్లు చర్చ సాగుతోంది. తాము చేసిన తప్పులను కప్పిపుచ్చుకునేందుకు ఇలాంటి ఆరోపణలు చేసినట్లు ఉన్నతాధికారుల రహస్య విచారణలో వెల్లడైంది. దీంతో సదరు సిబ్బందిపై ఉన్నతాధికారులు గుర్రుగా ఉన్నారని తెలిసింది. ఈ పరిస్థితుల్లో ఉమ్మడి జిల్లాకు రాష్ట్ర హోంశాఖ మంత్రి, డీజీపీ త్వరలో రానున్నారు. వారు వచ్చి వెళ్లాక వారంలోపే జిల్లాలో పోలీసు బదిలీలున్నాయి. ఈ బదిలీల్లో ఉన్నతాధికారులు గుర్తించిన సిబ్బందిపై వేటు వేస్తారా, శాఖాపరమైన చర్యల్లో భాగంగా సస్పెండ్ చేస్తారా అన్నది కొన్నిరోజుల్లో తేలనుంది. ఏది ఏమైనా అత్యాచారం కేసు నిందితుల విచారణ పోలీసుల వెన్నులో వణుకు పుట్టిస్తోంది.

ఎర్రచందనం కేసులో వైసీపీ నాయకుడి అరెస్టు



నిందితుడి వివరాలు వెల్లడిస్తున్న ఎస్ఐ

నంబులపూలకుంట, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని పెడబల్లి గ్రామ సమీపంలో విశ్వనాథ్‌రెడ్డి పొలంలో బయటపడిన ఎర్రచందనం దుంగల కేసులో అదే ఊరికి చెందిన వైసీపీ నాయకుడు మహేశ్వర్ రెడ్డిని పోలీసులు అరెస్టు చేశారు. ఇందుకు సంబంధించిన వివరాలను ఎస్ఐ వలీబాషా స్థానిక స్టేషన్‌లో శుక్రవారం వెల్లడించారు. గతంలో ఎర్రచందనం దుంగలను పొలంలో డంప్ చేశారు. వాటిని గత నెల 27న తరలించేందుకు ప్రయత్నించగా.. పోలీసులకు సమాచారం అందింది. పోలీసులు వెళ్లగా దుండగులు వాటిని వదిలేసి, పరారయ్యారు. పోలీసులు.. దుండగలను స్వాధీనం చేసుకున్నారు. 275 కేజీలు బరువున్న 21 దుంగలను పట్టుకున్నారు. వాటి విలువ రూ.5.50 లక్షలుగా లెక్కగట్టారు. దీనిపై కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేపట్టారు. అందులో భాగంగా పెడబల్లి బస్టాండు వద్ద శుక్రవారం నిందితుడు అదే ఊరికి చెందిన మహేశ్వర్‌రెడ్డిని అరెస్టు చేశారు. పరిపోయిన మిగతా నిందితులను త్వరలోనే పట్టుకుంటామని ఎస్ఐ వెల్లడించారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

మహిళ హత్య



మెహతాజ్ (ఫైల్)

పుట్టపర్తిరూరల్, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): వివాహేతర బంధం హత్యకు దారితీసింది. ఓబుళదేవరచెరువు మండలం కొండకమర్లకు చెందిన మెహతాజ్ (32)ను ఆమె ప్రియుడు ఇర్ఫాన్ గురువారం రాత్రి హత్య చేసినట్లు పుట్టపర్తి డీఎస్పీ విజయ్‌కుమార్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని కొండకమర్లకు చెందిన గొర్ల అల్లాబక్షు పెద్దకుమార్తె మెహతాజ్‌ను అదే గ్రామానికి చెందిన బాబ్‌జాన్‌కిచ్చి 14 ఏళ్ల క్రితం వివాహం చేశారు. ఈమెకు మండలంలోని డబురువారిపల్లికి చెందిన చెందిన ఇర్ఫాన్‌తో వివాహేతర బంధం ఏర్పడింది. మెహతాజ్.. మరొకరితో వివాహేతర బంధం కొనసాగిస్తోందని ఇర్ఫాన్ అనుమానం పెంచుకున్నాడు. ఆమెను చంపాలని నిర్ణయించుకున్నాడు. ఈ నేపథ్యంలో రెండ్రోజుల క్రితం మెహతాజ్.. పిల్లలతో కలిసి పుట్టింటికెళ్లింది. ఇర్ఫాన్ పథకం ప్రకారం గతనెల 31వతేదీ రాత్రి మెహతాజ్ ఇంట్లోకి వెళ్లాడు. ఆమెతో గొడవపడి గొంతునులిమి చంపేశాడు. ఇంటివెనుకవైపు నుంచి పారిపోయాడు. తరువాత గుర్తించిన కుటుంబీకులు.. పోలీసులకు సమాచారం అందించారు. హత్యాస్థలాన్ని డీఎస్పీ విజయ్‌కుమార్, ఎస్ఐ మల్లికార్జున రెడ్డి పరిశీలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టామనీ, త్వరలోనే నిందితుడిని పట్టుకుంటామని డీఎస్పీ వెల్లడించారు. మెహతాజ్‌కు కుమారుడు, కుమార్తె ఉన్నారు.

కుటుంబ కలహాలతో దంపతుల ఆత్మహత్యాయత్నం

బత్తలపల్లి, నవంబరు1(ఆంధ్రజ్యోతి): మండలంలోని ముష్టూరు గ్రామానికి చెందిన దంపతులు శ్రీరాములు, అశ్విని కుటుంబ కలహాలతో బుధవారం రాత్రి ఆత్మహత్యకు యత్నించారు. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. శ్రీరాములు తాగుడుకు బానిసై, రోజూ భార్యతో గొడవపడేవాడు. బుధవారం రాత్రి కూడా గొడవపడ్డాడు. దీంతో మనస్తాపం చెందిన అశ్విని విషయం తాగగా.. శ్రీరాములు ఫ్యాన్‌కు ఉరేసుకున్నాడు. వారి పిల్లలు గట్టిగా ఏడ్వడంతో చుట్టుపక్కల వారు వచ్చి, క్రిమిసంహారక మందు తాగి పడివున్న అశ్విని, ఉరికి వేలాడుతున్న శ్రీరాములును కిందికి దించి బత్తలపల్లి ఆర్డీటీ ఆస్పత్రికి తరలించారు. అశ్విని కోలుకోగా.. శ్రీరాములు చికిత్స పొందుతున్నాడు. వీరికి ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు.

చంద్రబాబు చేతిలో రైతాంగం దగా

- అన్ని మండలాలను కరువు జాబితాలో చేర్చాలి
- వైసీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి



అనంతపురం క్రైం, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలోని రైతాంగం ప్రకృతి చేతిలోనే కాదు.. ముఖ్యమంత్రి చంద్రబాబు చేతుల్లోనూ దగా పడిందని వైసీపీ అనంతపురం జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి అన్నారు. చంద్రబాబు మారలేదని, రైతాంగాన్ని ఆదుకునే విషయంలో తీవ్ర నిర్లక్ష్యం వహిస్తున్నారని మండిపడ్డారు. వైసీపీ జిల్లా కార్యలయంలో శుక్రవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఖరీఫ్‌లో వర్షాభావం కారణంగా ఉమ్మడి జిల్లా రైతాంగం తీవ్రంగా నష్టపోయిందని అన్నారు. అయినా ఉమ్మడి జిల్లాలో 17 మండలాలను మాత్రమే కరువు ప్రాంతాలుగా ప్రకటించి చేతులు దులుపుకోవడం భావ్యం కాదని అన్నారు. తక్షణం ఉమ్మడి జిల్లాలోని 63 మండలాలను కరువు ప్రాంతాలుగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. అప్పుడే కేంద్ర బృందం పర్యటించి, రైతులను ఆదుకునే అవకాశం ఉంటుందని అన్నారు. ముగ్గురు మంత్రులు, ఇతర ప్రజా ప్రతినిధులు చొరవ చూపాలని ఆయన కోరారు.

పోలవరం ఎత్తుపై..

పోలవరం ప్రాజెక్టు ఎత్తును తగ్గిస్తే ఎలాంటి ప్రయోజనం ఉండదని అనంత అన్నారు. ఈ విషయంలో చంద్రబాబు మరోసారి మోసం చేస్తున్నారని మండిపడ్డారు. పోలవరం ఎత్తు 45.72 మీటర్లు ఉంటే సుమారు 195 టీఎంసీలు నిల్వ చేసుకునే అవకాశం ఉంటుందని అన్నారు. అలా కాకుండా 41.15 మీటర్లకు పరిమితం చేస్తే గరిష్ఠంగా 115 టీఎంసీలు మాత్రమే నిల్వ అవుతుందని అన్నారు. ఇదే జరిగితే పోలవరం వల్ల రాష్ట్రానికి ఎలాంటి ప్రయోజనం లేకుండా పోతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రాజెక్ట్ ఎత్తును తగ్గిస్తూ కేంద్ర కేబినెట్ నిర్ణయం తీసుకున్నా, ఏపీకి చెందిన కేంద్ర మంత్రులు ఎందుకు మాట్లాడలేదని ప్రశ్నించారు. రాయలసీమకు కృష్ణా జలాలల కోసం గతంలో అనేక ఉద్యమాలు జరిగిన విషయాన్ని గుర్తు చేశారు. పోలవరం ప్రాజెక్టు వల్ల నేరుగా రాయలసీమకు లబ్ధి కలగకపోయినా పరోక్షంగా ప్రయోజనం ఉంటుందని అన్నారు. శ్రీశైలం నుంచి కృష్ణా జలాలు నాగార్జున సాగర్‌కు వెళ్తున్నాయని, పోలవరం పూర్తయితే ఆ నీటిని రాయలసీమకు ఉపయోగించుకునే అవకాశం ఉంటుందని అన్నారు. పోలవరం ప్రాజెక్టును 45.72 మీటర్లతోనే నిర్మిస్తామని ప్రధాని నరేంద్రమోదీతో ప్రకటన చేయించాలని డిమాండ్ చేశారు. లేదంటే కూటమి పార్టీలు, ప్రజాప్రతినిధులు మరోసారి రాష్ట్రానికి ద్రోహం చేసిన వారవుతారని అన్నారు.



హిందూపురం, నవంబరు1 (ఆంధ్రజ్యోతి): పరిగి మండలకేంద్రం సమీపంలోని చెరువు వరద నీటితో పూర్తిగా నిండి, మరువ పోతోంది. శుక్రవారం హోరుగా మరువ పారుతుండడంతో చుట్టుపక్కల గ్రామాలు పెద్దఎత్తున తరలివచ్చారు. ఇటీవల కర్ణాటకలో కురిసిన భారీ వర్షాలకు కుముద్వతి, జయమంగళి ప్రవహించాయి. ఆ నదుల నీరు పరిగి చెరువుకు చేరుతోంది. శుక్రవారం చెరువు పూర్తిగా నిండి, మరువ నీరు పరవళ్లు తొక్కుతోంది.

అప్పులబాధతో వ్యక్తి ఆత్మహత్య



బొమ్ము అనిల్ కుమార్ (ఫైల్)

రాప్తాడు, నవంబరు1(ఆంధ్రజ్యోతి): రాప్తాడు పంచాయతీ పరిధిలోని ముస్లిం మైనార్టీ కాలనీలో అప్పుల బాధ తాళలేక బొమ్ము అనిల్ కుమార్(41) ఉరి వేసుకున్నాడు. అనిల్‌కుమార్ మట్టి పెల్లల ఫ్యాక్టరీని నిర్వహించేవాడు. వ్యాపారం సరిగా నష్టపోయాడు. వ్యాపారం, కుటుంబ పోషణకు చేసిన అప్పులు తీర్చలేక ఇబ్బంది పడ్డాడు. అప్పుల వారి నుంచి ఒత్తిడి ఎక్కువైందని కుటుంబ సభ్యుల వద్ద ఆవేదన వ్యక్తం చేసేవాడు. ఈ క్రమంలో శుక్రవారం ఉదయం కందుకూరు రోడ్డులోని రేకులషెడ్‌లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఆయనకు భార్య హేమ చంద్రిక, కుమారుడు లక్ష్మీ నితిన్, కూతురు హిమవర్షిణి ఉన్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

4న జిల్లా ఇన్‌చార్జి మంత్రి రాక

పుట్టపర్తి, నవంబరు1(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర రెవెన్యూ రిజిస్ట్రేషన్ స్టాంపుల శాఖ, శ్రీసత్యసాయి జిల్లా ఇన్‌చార్జి మంత్రి అనగాని సత్యప్రసాద్ సోమవారం పుట్టపర్తికి వస్తున్నారు. జిల్లా కేంద్రం పుట్టపర్తి సాయి ఆరామంలో ఉదయం పది గంటలకు నిర్వహించే ఎన్డీఏ కూటమి జిల్లా స్థాయి సమన్వయ కమిటీ సమావేశంలో పాల్గొంటారు. అనంతరం మధ్యాహ్నం కలెక్టరేట్‌లో జిల్లా స్థాయి అధికారులతో నిర్వహించే సమావేశంలో పాల్గొంటారు.

9లోగా దరఖాస్తు చేసుకోండి

లేపాక్షి, నవంబరు1(ఆంధ్రజ్యోతి): స్థానిక జవహర్ నవోదయ పాఠశాలలో 2025-26 సంవత్సరానికి 9, 11 తరగతుల్లో ప్రవేశానికి ఈనెల 9వ తేదీలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ నాగరాజు శుక్రవారం ప్రకటనలో తెలిపారు. ఈ అవకాశాన్ని ఉమ్మడి అనంతపురం జిల్లాలో ప్రస్తుతం 8, 10 తరగతులు చదువుతున్న విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. వివరాలకు నవోదయ పాఠశాలలో సంప్రదించాలన్నారు.

వైసీపీ నాయకుడి మట్టి దందాపై చర్యలు తీసుకోండి

తహసీల్దార్‌కు టీడీపీ నాయకుల వినతి



వినతిపత్రం అందజేస్తున్న టీడీపీ నాయకులు

యాడికి, నవంబరు1(ఆంధ్రజ్యోతి): మట్టి దందా చేస్తున్న వైసీపీ మండల కన్వీనర్ బొంబాయి రమేష్‌నాయుడుపై చర్యలు తీసుకోవాలని కోరుతూ శుక్రవారం టీడీపీ నాయకులు మండలకేంద్రంలో తహసీల్దార్ ప్రతాప్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీపీ వేలూరు రంగయ్య, టీడీపీ మండల కన్వీనర్ రుద్రమనాయుడు మాట్లాడుతూ... యాడికి గ్రామ పంచాయతీ పరిధిలో వైసీపీ మండల కన్వీనర్ మట్టిని అక్రమంగా రవాణా చేస్తూ దందా కొనసాగిస్తున్నారని తెలిపారు. గత ఐదేళ్లుగా మట్టి అక్రమ వ్యాపారానికి అడ్డూ అదుపు లేకుండా పోయిందన్నారు. ఆయన అక్రమంగా వేసిన లేఔట్‌లోకి ప్రభుత్వభూములు, వంకల్లోని మట్టిని పెద్దఎత్తున తరలించి సొమ్ముచేసుకున్నారన్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో అధికారాన్ని అడ్డుపెట్టుకుని అనధికార లేఔట్లు లెక్కలేనన్ని వేశారని తెలిపారు. వైసీపీ నాయకుడి మట్టి దందాపై విజిలెన్స్ అధికారులచేత విచారణ చేయించి తగు చర్యలు తీసుకోవాలని వారు కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో నాయకులు లక్ష్మణ్, ఆదినారాయణ, నాగశేఖర్, విజయ్, చంద్రశేఖర్, మధురాజు, నాగమునిరెడ్డి, రవికుమార్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

విద్యార్థులతో చెత్త పనులు

తనకల్లు, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని చీకటిమానుపల్లి ప్రాథమిక ఉన్నత పాఠశాలలో విద్యార్థులతో చెత్త పనులు చేయిస్తున్నారు. పాఠశాలలో శుభ్రం చేయించి.. ఆ చెత్తను వారితోనే పారేయిస్తున్నారు. ప్రభుత్వం విద్యార్థులతో ఇలాంటి చెత్త పనులు చేయించకూడదనే ఉద్దేశంలో పాఠశాలలను శుభ్రం చేయడానికి ఆయాలను నియమించి జీతాలు ఇస్తోంది. అయినా పాఠశాల సిబ్బంది విద్యార్థులతో ఇలాంటి పనులు చేయిస్తుండటం పలు విమర్శలకు తావిస్తోంది. ఆ పాఠశాలలో మూడో తరగతి విద్యార్థులు మధుమతి, చరన్ ఆ పాఠశాలలో శుక్రవారం శుభ్రంగా చేయగా వచ్చిన చెత్తను పెద్ద బకెట్లో.. పెద్ద కర్ర సాయంతో మోసుకొంటూ వెళ్లి.. ఆ పాఠశాల సమీపంలో పారబోశారు. దీన్ని గమనించిన గ్రామస్థులు ఫొటోలు తీసి.. సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ చేశారు. దీనిపై హెచ్‌ఎం మహబూబీని వివరణ కోరగా.. పిల్లలతో చెత్తపనులు చేస్తున్న విషయం తమదృష్టికి వచ్చిందని, చెత్త తీసుకెళ్తున్న చరణ్, మధుమతి పాఠశాలలో పనిచేస్తున్న ఆయా అంజనమ్మకు బంధువులు కావడంతో ఈ పనులు చేయించిందని తెలిపారు. ఇలాంటి పనులు పిల్లలతో చేయించవద్దను ఇప్పటికే ఆమెకు పలుమార్లు సూచించామన్నారు.



పాఠశాల వద్ద చెత్త మోసుకెళ్తున్న విద్యార్థులు

నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కామ్...

పానుగంటి లక్ష్మీనరసింహారావు (జయంతి)



ప్రముఖ తెలుగు సాహితీవేత్త పానుగంటి లక్ష్మీనరసింహారావు 1865 నవంబరు 2న రాజమండ్రి తాలూకా సీతానగరంలో జన్మించారు. కవి శేఖరుడు, అభినవ కాళిదాసు, ఆంధ్ర అడిసన్, ఆంధ్ర షేక్స్పియర్ అనే బిరుదులు పొందారు. చదివినకొద్దీ మరింతగా చదివేందుకు ఉత్సాహం కలిగించేలా ఆయన రచనలు ఉంటాయి. సారంగధర చరిత్ర, విజయ రాఘవము, కోకిల, విప్రనారాయణ చరిత్ర వంటివి పేరొందాయి. పలు సంస్థానాలలో దివానుగా వ్యవహరించారు. 1940 అక్టోబరు 7న కన్నుమూశారు.

అరుణ్ శౌరి (పుట్టినరోజు)




'పద్మభూషణ్' పురస్కార గ్రహీత అరుణ్‌శౌరి 1941 నవంబరు 2న పంజాబ్ రాష్ట్రం జలంధర్‌లో జన్మించారు. ఆర్థికవేత్తగానే కాకుండా పాత్రికేయుడిగా, రచ యితగా రాణించారు. వరల్డ్ బ్యాంకులో ఆర్థికవేత్తగాను, ప్లానింగ్ కమిషన్ ఆఫ్ ఇండియాకు కన్సల్టెంట్‌గా వ్యవహరించారు. రాజ్యసభ సభ్యుడిగా కేంద్రంలో వివిధ మంత్రిత్వశాఖలు నిర్వ హించారు. ఇండియన్ ఎక్స్‌ప్రెస్, ది టైమ్స్ ఆఫ్ ఇండియా పత్రికలకు ఎడిటర్‌గా వ్యవహరించారు. బయోసైన్సెస్, బయో ఇంజనీరింగ్‌లో సేవలకు రామన్ మెగసెసె అవార్డు పొందారు.

షారుఖ్‌ఖాన్ (పుట్టిరోజు)



సినీ రంగంలో 'బాద్ షా ఆఫ్ బాలీవుడ్'గాను 'కింగ్ ఖాన్' పేరొందిన షారుఖ్‌ఖాన్ 1965 నవంబరు 2న న్యూఢిల్లీలో జన్మించారు. ప్రపంచవ్యాప్తంగా ఆయనకు అభిమానులు ఉన్నారు. నటుడిగానే కాక నిర్మాతగా, బుల్లితెర పర్సనాలిటీగా పేరొందారు. 80కుపైగా సినిమాలలో నటించగా దాదాపు బాక్సాఫీస్ హిట్ అందుకున్నాయి. 'పద్మశ్రీ' సహా ఎన్నో పురస్కారాలతోపాటు 5గౌరవ డాక్టరేట్‌లు, 14 ఫిల్మ్‌ఫేర్ అవార్డులు ఇతర గౌరవాలు పొందారు. మోషన్ పిక్చర్ ప్రొడక్షన్ కంపెనీకి కో-చైర్మన్‌గా వ్యవహరిస్తున్నారు. ఐపీఎల్ క్రికెట్‌లో కోల్కత్తా నైట్ రైడర్స్, కరీబియన్ ప్రీమియర్‌లీగ్ జట్లకు సహ భాగస్వామ్యం కలిగారు. 2023లో టైమ్ మ్యాగజైన్ జాబితాలో అత్యంత ప్రభావశీలుర వ్యక్తిలో ఒకరిగా నిలిచారు. కొవిడ్ వేళ సామాజికసేవలతో ప్రజల అభిమానం పెరిగింది.

యోగేశ్వర్‌దత్ (పుట్టినరోజు)



'పద్మశ్రీ' పురస్కార గ్రహీత యోగేశ్వర్ దత్ 1982 నవంబరు 2న హర్యానా రాష్ట్రం సోనిపట్ జిల్లా భైన్స్‌వాల్ కాలన్ గ్రామంలో జన్మించారు. ఫ్రీస్టైల్ రెజ్లర్. 8వ యేటనుంచే రెజ్లింగ్‌లో ప్రతిభ కనబరిచి స్వగ్రామంలో బాలరాజ్ పహిల్వాన్‌గా గుర్తింపు పొందారు. ఏషియన్ గేమ్స్‌లో పాల్గొని రజత పురస్కారాలు పొందారు. 2012 సమ్మర్ ఒలింపిక్స్‌లో కాంస్యపతకం, 2014 కామన్వెల్త్ గేమ్స్‌లో బంగారు పతకం అందుకున్నారు. 'రాజీవ్‌గాంధీ ఖేల్ రత్న'తోపాటు పలు అవార్డులు పొందారు. హర్యానా హ్యామర్స్‌లో ఐకాన్ కేటగిరీలో చోటు సాధించారు. 2019లో బీజేపీలో చేరారు.

అంబరాన్నంటిన రాజ్యోత్సవం



తాలూకాస్థాయి రాజ్యోత్సవ పురస్కారాలు అందుకున్న ప్రముఖులు



బెంగళూరు తూర్పు తాలూకా తహసీల్దార్ రాజీవ్ తదితరులు



కన్నడ గెళెయర బళగ ఆధ్వర్యంలో కన్నడ రాజ్యోత్సవం

బెంగళూరు, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): కన్నడ భాష, సంస్కృతికోసం ఎందరో మహనీయులు జీవితకాలం పోరాటం చేశారని కన్నడ గెళెయర బళగ వ్యవస్థాపకుడు రానం చంద్రశేఖర్ అభిప్రాయపడ్డారు. శుక్రవారం లాల్‌బాగ్ వెస్ట్‌గేట్‌లో కువెంపు, బీఎంశ్రీల విగ్రహాలకు పుష్పాంజలి ఘటించారు. ఈ సందర్భంగా రానం చంద్రశేఖర్ మాట్లాడుతూ కన్నడ భాషకు వేల ఏళ్ల చరిత్ర ఉంద న్నారు. కన్నడ సాహిత్యం వెలకట్టలేనిదన్నారు. శేష శాస్త్రి, రమేశ్‌బాబు, రుద్రేశ్ అదరంగితోపాటు పలువురు పాల్గొన్నారు. కన్నడ సాధకుడు రామకృష్ణకు ప్రత్యేకంగా సత్కరించారు.

కన్నడ అభివృద్ధికి అందరి సహకారం

బంగారపేట: కన్నడ భాష అభివృద్ధికి అందరి సహకారం అవసరమని ఎమ్మెల్యే ఎస్ఎన్ నారాయణస్వామి అభిప్రాయపడ్డారు. పురసభ కార్యాలయంలో జాతీయ పండుగల సమితి ఆధ్వర్యంలో శుక్రవారం కన్నడ రాజ్యోత్సవం, వాల్మీకి జయంతిలో పాల్గొని మాట్లాడారు. కన్నడలో ప్రసంగాలు చేయడమేకాక రచనలు కూడా పెరగాలని తద్వారా భాష సమగ్రాభివృద్ధి సాధ్యమన్నారు. స్వాతంత్ర్యానంతరం కొన్నేళ్లకు అప్పటి ముఖ్యమంత్రి కర్ణాటకగా నామకరణం చేసి 50ఏళ్లు గడుస్తోందన్నారు. కన్నడకు శాస్త్రీయహోదాతోపాటు 8 జ్ఞానపీఠ పురస్కారాలు అందడం ద్వారా సాహితీలోకంలో ఒక రికార్డుగా ఉంద న్నారు. బంగారపేట పట్టణం తమిళ నాడు, ఆంధ్రప్రదేశ్‌లకు సరిహద్దున ఉన్నా రాజ్యోత్సవం ఆచరించడం గర్వకారణమన్నారు. ఎంతోకాలంగా ప్రజలు ఎదురుచూస్తున్న కన్నడ భవనాన్ని రూ.2కోట్లతో నిర్మించదలిచామన్నారు. దాతల సహకారంతో రీడింగ్ రూం, గ్రంథాలయం, ఇతర ఫర్నీచర్ సమకూర్చడం తో పాటు త్వరలోనే పాత్రికేయుల లయన్స్ భవన నిర్మాణా నికి శంకుస్థాపన చేస్తామన్నారు. తహసీల్దార్ వెంకటేశప్ప మాట్లాడుతూ ఇక్కడి ప్రజలు సహృదయులని, ఇతర భాషలవారితోనే భావనాత్మకంగా మెలగుతున్నారన్నారు. ఇదే సందర్భంగా ఎస్ఎస్ఎల్సీ, ద్వితీయ పీయూసీలలో కన్నడలో అత్యధిక మార్కులు పొందిన విద్యార్థులను సత్కరించారు. ఉపతహసీల్దార్ ప్రభాకర్, పీడీఓ నాగేశ్, కన్నడ పోరాట నేత రంగరామయ్య, పోలీసుశాఖ నుంచి నాగేశ్ తదితరులకు తాలూకాస్థాయి రాజ్యోత్సవ పుర స్కారంతో గౌరవించారు. కార్యక్రమంలో పురసభ అధ్య క్షుడు గోవింద, సభ్యులు చంద్రారెడ్డి, కన్నడసంఘం అధ్య క్షుడు సుబ్రమణి, షంషుద్దీన్‌బాబు, పార్థసారథి తదితరులు పాల్గొన్నారు.

సంస్కృతిని అర్థం చేసుకుంటేనే సార్థకత

దొమ్మసంద్ర : కన్నడ భాష చరిత్ర, కళలు, సంస్కృతి, ఆచార వ్యవహారాలను అర్థం చేసుకున్నప్పుడే కన్నడ రాజ్యోత్సవానికి సార్థకత సాధ్యమని సర్జాపుర గ్రామపంచాయతీ మాజీ అధ్యక్షుడు, ప్రస్తుత సభ్యుడు ఎస్ఎం శ్రీనివాస్ అభిప్రాయపడ్డారు. సర్జాపుర గ్రామపంచాయతీ ఆవరణలో శుక్రవారం ఏర్పాటైన 69వ కన్నడ రాజ్యోత్సవంలో కన్నడ పతాకాన్ని ఎగురవేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్రం కోసం ఎంతోమంది మహనీయుల శ్రమ సాధన ఉందన్నారు. రాజ్యోత్సవం కేవలం నవంబరు నెలకే పరిమితం కాకుండా ఏడాది పొడవునా జరపాలని ఆకాంక్షించారు. చరిత్రలను పరిశీలిస్తే హల్మిడి శాసనాలు తొలి కన్నడ శాసనంగా ఉన్నాయని, గంగరు, కదంబ, చాళుక్యులు, హొయసళ, రాష్ట్రకూటులు పాలించారన్నారు. కర్ణాటక విజయనగర రాజుల కాలంలో రత్నాలతో శ్రీమంత రాజ్యంగా ఉండే దన్నారు. కన్నడ సాహితీ లోకానికి ఎంతోమంది సేవ లందించారని వారిసేవలను స్మరించుకుని గర్వపడాల న్నారు. అదే రీతిన కన్నడ భాషా సంస్కృతులను మన భావితరాలకు పదిలంగా అందించాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు. కార్యక్రమంలో సర్జాపుర గ్రామపంచాయతీ అధ్యక్షురాలు మమతా రమేశ్, మాజీ ఉపాధ్యక్షుడు ఎస్ఏ సతీశ్ కుమార్, సభ్యులు శ్రీనివాస్, సిబ్బంది మునిరాజు, లక్ష్మణ్, మునియప్ప, అనిత్‌కుమార్, చరణ్, సునీల్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

యువతకు అవగాహన కల్పించాలి..

మహదేవపుర: కన్నడ రాజ్యోత్సవాన్ని అర్థవంతంగా ఆచరించాలని, యువతకు కన్నడ నాడు ఇతిహాసం, సంస్కృతి, కళలు, భాషపట్ల అవగాహన కల్పించడం మన కర్తవ్యమని బెంగళూరు తూర్పు తాలూకా తహసీల్దార్ రాజీవ్ అభిప్రాయపడ్డారు. కేఆర్‌పుర తాలూకా కార్యా లయంలో 69వ కన్నడ రాజ్యోత్స వాన్ని ప్రారంభించి మాట్లాడుతూ కన్నడనాడుకు ఎంతో సాహిత్యం విలువ ఉందన్నారు. తాలూకా కార్యాలయంలో నాడ హబ్బ రాజ్యోత్సవంలో కన్నడ సంఘాల ప్రముఖులు, కన్నడ అభిమానులు పాల్గొన్నారు.



మేలూరులో కన్నడ రాజ్యోత్సవంలో గ్రామస్తులు

మేలూరులో...

శిడ్లఘట్ట, తాలూకా లోని మేలూరు గ్రామం చంగలరాయరెడ్డి సర్కిల్‌లో కన్నడ రాజ్యోత్సవాన్ని అర్థవంతంగా ఆచరించారు. ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు పాల్గొనగా కన్నడ పతాకాన్ని ఆవిష్కరించారు. నాడగీతను ఆలపించారు. గ్రామపంచాయతీ మాజీ అధ్యక్షుడు, ప్రస్తుత సభ్యుడు ఉమేశ్, డాక్టర్ రాజ్‌కుమార్ అభిమానుల సంఘం శ్రీని వాస మూర్తి, ధర్మేంద్ర, సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు. తాలూకా వ్యాప్తంగా పలు చోట్ల కన్నడ రాజ్యోత్సవం ఘనంగా జరిగింది.



సర్జాపురలో కన్నడ రాజ్యోత్సవం

కన్నడ పోరాటాలకు అందరి మద్దతు



దొడ్డబళ్లాపురలో వివిధ రంగాల ప్రముఖులకు సన్మానం

దొడ్డబళ్లాపుర, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): కన్నడ భాష సంస్కృతుల మనుగడకు సాగే పోరాటాలకు అందరి సహకారం అవసరమని ఎమ్మెల్యే ధీరజ్ మునిరాజు అభిప్రాయపడ్డారు. పట్టణంలోని డాక్టర్ రాజ్‌కుమార్ కళామందిరంలో తాలూకా జాతీయ పండుగల సమితి ఆధ్వర్యంలో 69వ కన్నడ రాజ్యోత్సవంలో పాల్గొని మాట్లాడారు. కర్ణాటక ఏకీకరణ దినోత్సవం మనందరికి సంతోషకరమైన అంశమన్నారు. కన్నడ భాషకు వేలసంవత్సరాల చరిత్ర ఉందన్నారు. కన్నడ సాహితీ వైభవాన్ని మన యువతకు చాటాల్సిన అవసరం ఉందన్నారు. ఇదే సందర్భంగా యక్షగానంలో దీక్షాకంతి, నాటకరంగంలో ఎంజి రామచంద్ర, సమాజసేవలో అన్నపూర్ణ, కన్నడ పోరాటనేత సురేశ్, మీడియా రంగంలో గంగరాజు సహా మొత్తం 14 మందిని సత్కరించారు. కార్యక్రమంలో నగరసభ అధ్యక్షురాలు సుమిత్ర ఆనంద్, ఉపాధ్యక్షుడు మల్లేశ్, తహసీల్దార్ విభా విద్యారాథోడ్, తాలూకా పంచాయతీ ఈఓ మునిరాజు, నగరసభ కమిషనర్ కార్తీకేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

10న రాగిముద్ద ఆరగించే పోటీలు



నిర్వాహకుడు అనిల్‌రెడ్డి

బొమ్మనహళ్ళి, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): నియోజక వర్గంలోని హెచ్ఎస్ఆర్ లేఅవుట్ పరంగిపాళ్యలో ఈనెల 10న రాగిముద్ద, నాటుకోడి పులుసు ఆరగించే పోటీలు జరగనున్నాయి. రాష్ట్ర స్వర్ణోత్సవాలను పురస్కరించుకుని ఇదే తొలిసారి పోటీలు జరుపుతున్నామని నిర్వాహకుడు అనిల్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ పురుషుల విభాగంలో ప్రథమ బహుమతిగా పొట్టేలు, ద్వితీయబహుమతిగా గొర్రె, తృతీయ బహుమతిగా రెండు నాటుకోళ్లు ఇవ్వనున్నట్టు తెలిపారు. ఇక మహిళల విభాగంలో ప్రథమ బహుమతిగా 32 ఇంచీల టీవీ, రెండో బహుమతిగా మిక్సర్ గ్రైండర్, తృతీయ బహుమతిగా కిచెన్‌సెట్ ఉంటుందన్నారు. సాధారణంగా మండ్యలో ఇలాంట పోటీలు ఉంటాయన్నారు. పోటీలకు ప్రవేశం ఉచితమని, నమోదు చేసుకున్న 125మందికి తొలిప్రాధాన్యత ఉంటున్నారు. ఈనెల 10న ఆదివారం మధ్యాహ్నం 12 నుంచి 12.45 వరకు పోటీ ఉంటుందన్నారు. మరిన్ని వివరాలకు 9916506837కు సంప్రదించాలన్నారు. మద్యంతాగి వచ్చేవారికి పోటీల్లో అనుమతించేది లేదన్నారు. పోటీలను ఎమ్మెల్సీ టీకే హరిప్రసాద్ ప్రారంభించనుండగా బహుమతులను మంత్రి రామలింగారెడ్డి ప్రారంభిస్తారన్నారు. టి వాసుదేవ రెడ్డి అధ్యక్షత వహించనుండగా ముఖ్యఅతిథులుగా సినీ నిర్మాత ఉమాపతిగౌడ, యువ కాంగ్రెస్ కార్యాధ్యక్షుడు మంజునాథ్‌గౌడ, భారతీయ సేవా సమితి జాతీయ అధ్యక్షుడు డాక్టర్ హెచ్ఎం రామచంద్ర విచ్చేస్తారన్నారు. పోటీలకు అందరూ సహకరించాలని కోరారు.

వెంకటాపుర అధ్యక్షుడిగా తిరుపళ్లప్ప



అధ్యక్షుడు తిరుపళ్లప్ప ఇతరులతో కాంగ్రెస్ నాయకుడు రాజీవ్‌గౌడ

శిడ్లఘట్ట, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): తాలూకాలోని జె వెంకటాపుర గ్రామ పంచాయతీ అధ్యక్షుడిగా తిరుపళ్లప్ప విజయం సాధించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకుడు రాజీవ్‌గౌడ ప్రత్యేకంగా అభినందించారు. అధ్యక్షస్థానానికి బుధవారం ఎన్నికలు నిర్వహించగా బళువనహళ్ళి పంచాయతీ సభ్యుడు తిరుపళ్లప్ప ఒక్కరే నామినేషన్ వేయడంతో ఏకగ్రీవమైనట్టు ప్రకటించారు. కార్యకర్తలు విజయోత్సవం నిర్వహించారు. రాజీవ్‌గౌడ మాట్లాడుతూ తాలూకాలో కాంగ్రెస్ బూత్‌స్థాయిలో పటిష్టంగా ఉందని మరింత బలోపేతం కావాలన్నారు. ఈ సందర్భంగా మాజీ అధ్యక్షుడు గుడియప్ప, బ్లాక్‌కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు హొసపేటె మునియప్ప, గ్రామపంచాయతీ మాజీ అధ్యక్షుడు పరమేశ్వర్, గ్రామపంచాయతీ సభ్యులు, కాంగ్రెస్ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

దేవీరమ్మ దర్శనంలో భక్తులకు అస్వస్థత

- పలువురిని రక్షించిన పోలీసులు
- చిక్కమగళూరు జిల్లాలో ఘటన



కొండపై భక్తుల రద్దీ

బెంగళూరు, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): చిక్కమగళూరు తాలూకా మాణిక్యధార దేవీరమ్మ కొండపై వెలసిన దేవీరమ్మ దర్శనం కోసం వెళ్లిన భక్తులు ఇబ్బందిపడ్డారు. దీపావళి వేళ ఏడాదికోసారి మాత్రమే దేవీరమ్మ దర్శనం చేసుకునేందుకు వీలుంటుంది. భక్తులు కొండపైకి నడిచి వెళ్లాల్సి ఉంటుంది. భక్తుల సౌకర్యం కోసం పలు ఏర్పాట్లు చేశారు. అయినా కొండపైకి నడిచివెళ్లేందుకు సాధ్యం కాక పలువురు ఇబ్బందిపడ్డారు. 3,800 అడుగుల ఎత్తులో ఉన్న కొండపైకి చేరుకోవడానికి నడకదారి మినహా మరో మార్గం లేదు. సుమారు 8మంది భక్తులు అస్వస్థతకు లోనయ్యారు. వారిని స్ట్రెచర్‌ల ద్వారా అత్యవసరంగా తరలించారు. 800మందికిపైగా పోలీసులు విధులలో పాల్గొన్నారు. నడకమార్గం మినహా మరో అవకాశం లేకపోవడం ఏమాత్రం పక్కకు వెళ్లినా కిందకు జారిపడే ప్రమాదం ఉండడంతో భక్తులు ఇబ్బందిపడ్డారు. భక్తులు తీసుకెళ్లిన వెన్న, నెయ్యి, చీర, రవికె, కట్టెలతో గురువారం రాత్రి అగ్నిని ప్రజ్వలింపచేశారు. చిక్కమగళూరు పరిధిలోని ప్రజలు జ్యోతిని తిలకించారు.

టపాసులు పేలి పలువురికి గాయాలు

బెంగళూరు, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): దీపావళి పండుగ వేళ టపాసులు పేలిన ప్రమాదంలో పలువురు గాయపడ్డారు. నగరం లోని శంకర ఆసుపత్రిలో ముగ్గురు, నారాయణ ఆసుపత్రిలో ముగ్గు రు, మింటో ఆసుపత్రిలో ఒకరితోపాటు అగర్వాల్ ఆసు పత్రిలో 9మంది చికిత్సలు పొందుతున్నారు. ఇద్దరు పిల్లల కళ్లకు దెబ్బలు తగలగా రాజాజినగర్ నారాయణ నేత్రాలయలో చికిత్సలు అందిస్తు న్నారు. గాయపడినవారంతా 17ఏళ్లలోపువారిగా తెలుస్తోంది.



కేంద్ర మాజీ మంత్రి వీరప్ప మొయిలీకి రాజ్యోత్సవ పురస్కారం అందజేస్తున్న సీఎం



సాంస్కృతిక ప్రదర్శనలో విద్యార్థులు



విద్యార్థుల కవాతు

అడిగేవారు లేరనా..?

- విచ్చలవిడిగా నిధుల వాడకం
- పదవీకాలం ముగిసినా కొనసాగుతున్న కార్యవర్గం
- ఒక వర్గానిదే ఆధిపత్యం
- అనంతపురం క్లబ్ ఎన్నికలపై వీడని సందిగ్ధత

అనంతపురం క్లాక్‌టవర్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): ప్రశ్నించేవారు లేరని తమకు నచ్చిన రీతిలో నిధులను దుర్వినియోగం చేశారు. అనంతపురం క్లబ్‌లో అక్రమాలకు అంతే లేకుండా పోతోంది. నగర నడిబొడ్డున సుమారు ఐదెకరాల్లో 1954లో ఆఫీసర్స్ క్లబ్‌ను ఏర్పాటు చేశారు. కాలక్రమంలో దానిని అనంతపూర్ క్లబ్‌గా మార్చారు. అప్పటి నుంచి క్లబ్‌లో బార్, పేకాట, క్రీడలతో పాటు పలు కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. ఇటీవలే క్లబ్ ఎన్నికలకు నోటిఫికేషన్ ఇచ్చారు. ప్రస్తుత కార్యవర్గం పదవీ కాలం ముగిసి ఐదు నెలలు కావస్తున్నా నేటికి కొనసాగుతున్నారు. ఇద్దరు సీనియర్ క్లబ్ సభ్యులు కలెక్టర్‌కు ఆధారాలతో ఫిర్యాదు చేశారు. ఆయన ఆదేశాల మేరకు డీసీఓ, ఆర్డీఓ, తహసీల్దార్ విచారణ చేశారు. ఎన్నికలు ఎప్పుడు నిర్వహిస్తారనేది ఇప్పటికీ స్పష్టత రావడం లేదు. నిధుల దుర్వినియోగంపై క్లబ్‌లో ప్రశ్నించేనాథుడే లేడు. బోగస్ బిల్లులతో నిధులు ఐస్ ముక్కల్లా కరిగిపోతున్నాయి.

అంతులేని వింతలు

అంతులేని వింతలకు అనంతపురం క్లబ్ వేదికగా మారింది. 2020లో ఆకస్మికంగా తెరపైకి వచ్చిన రామాంజనేయులు క్లబ్ సెక్రటరీ అయ్యారు. 2022లో ఎన్నికల నోటిఫికేషన్ ఇచ్చారు. నామినేషన్ చివరి రోజు సాయంత్రం 5గంటలకు వైసీపీ రాప్తాడు కీలకనేత జోక్యంతో ప్రస్తుత కార్యదర్శి కేశవరెడ్డి తెరపైకి వచ్చారు. పోటీలో ఉన్న సభ్యులందరినీ బెదిరించి కేశవరెడ్డిని ఏకగ్రీవం చేశారు. కేశవరెడ్డి పదవీ కాలం ముగిసి 5 నెలలు కావస్తున్నా ఎన్నికలు నిర్వహించలేదు.

విచ్చలవిడిగా నిధుల వాడకం

అనంతపురం క్లబ్‌లో సుమారు 20 ఏళ్లుగా విచ్చలవిడిగా నిధుల వాడేస్తున్నారు. 15 ఏళ్ల పాటు క్లబ్ సెక్రటరీగా పనిచేసిన గాంధీరెడ్డి హయాంలో కోట్లాది రూపాయల నిధులను దుర్వినియోగం చేశారనే ఆరోపణలు ఉన్నాయి. ప్రధానంగా క్లబ్ కాంప్లెక్స్‌లో అద్దె గదుల నిర్వహణ, బార్ ఏర్పాటులో గోల్‌మాల్ జరిగింది. అధికారికంగా క్లబ్ ఆవరణంలో 10 షాపులు, ఒక హోటల్‌ను అద్దెకు ఇచ్చారు. ఇందులో క్లబ్‌కు కట్టేది రూ.1.80 లక్షలు మాత్రమే. వసూలు చేసేది రూ.10లక్షలకు పైగానే అని సమాచారం. సెక్రటరీ ఆధ్వర్యంలో జరిగే క్లబ్ నిర్వహణలో అనేక రూపాలలో ఆదాయం ఉన్నప్పటికీ నిధులు ఎక్కడికి వెళ్తున్నాయో అర్థం కాని పరిస్థితి.

ఎన్నికలపై గందరగోళం

క్లబ్ ఎన్నికలపై గందరగోళం నెలకొంది. క్లబ్ ఓటర్లు, సభ్యులు, అద్దె గదుల వివాదాలపై డీసీఓ, ఆర్డీఓ, తహసీల్దార్ ఇప్పటికే విచారణ చేసి కలెక్టర్‌కు నివేదికను అందజేశారు. విచారణ అనంతరం ఎన్నికలు నిర్వహిస్తారని సభ్యులు భావించారు. పాలకవర్గంలో అధ్యక్షుడిగా కలెక్టర్, ఉపాధ్యక్షుడిగా ఎస్పీ వ్యవహరిస్తారు. ఎన్నికల్లో కార్యదర్శి, ఇద్దరు సంయుక్త కార్యదర్శులు, ఆరుగురు కార్యవర్గ సభ్యులను ఓటింగ్ ద్వారా ఎన్నుకుంటారు. ప్రస్తుతం ఎన్నికల నిర్వహణపై సందిగ్ధం కొనసాగుతోంది.





తుంగభద్ర నీటి మట్టం :1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1632.00	1,607.07
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	11,860	0
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	11,620	9,017
నీటి నిల్వ (టీఎంసీలు)	101.77	32.15

'గాలి'పై రైతుల ఆగ్రహం

కంప్లి, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): ఉప ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న ఎమ్మెల్యే గాలి జనార్దన్ రెడ్డిపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం రాత్రి కుడితినిలో ప్రచారం చేస్తుండగా మాజీ మంత్రి శ్రీరాములు, ఎమ్మెల్యే జనార్దన్ రెడ్డిపై ప్రశ్నలతో ముంచెత్తారు. కర్మాగారాల కోసం భూములు పోగొట్టుకుని నిరసన చేపట్టున్నా పట్టించుకోలేదని, ఎన్నికల వేళ మాత్రమే తాము గుర్తొస్తామా అంటూ ధ్వజమెత్తారు. పదేళ్లుగా పదవిలో ఉన్నా బీజేపీ నాయకులు కేవలం మాటలకే పరిమితమయ్యారని, న్యాయం చేసిందేమీ లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. సుమారు 600 రోజులకు పైగా నిరసనలు చేపడుతున్నా పట్టించుకో లేదన్నారు. ఆ సభలో జనార్దన్‌రెడ్డి పోలీసులకు ఇక్కడ తాగి మాట్లాడటం సరికాదని, అలాంటి వారిని తీసుకెళ్లాలని సూచించగా రైతులు మరింత ఆగ్రహానికి గురయ్యారు. అంతలో ఆయన ప్రచారం ముగించుకుని వెళ్లిపోయారు.

దాడి కేసులో నాలుగేళ్ల జైలు

బళ్లారిరూరల్, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): వ్యక్తిపై దాడి చేసిన కేసులో దోషికి నాలుగేళ్ల జైలు శిక్ష విధించారు. బళ్లారి రూరల్ తాలుకాలోని ఎత్తిన బూదేహాళ్ గ్రామంలో 2022వ సంవత్సరం సెప్టెంబరు 9వ తేదీన బూదేహాళ్ రాజేష్ అనే యువకుడిపై నవీన్ దాడి చేశాడు. కేసుపై విచారణ జరిపిన న్యాయస్థానం గురువారం తీర్పు వెల్లడించింది. నాలుగేళ్ల జైలు శిక్షతో పాటు, గాయపడిన రాజేష్‌కు రూ. 15 వేలు చెల్లించాలని తీర్పులో వెల్లడించింది.

వాహనదారులకు ట్రాఫిక్ పోలీసుల ఝులక్..!

● హెల్మెట్ లేని వారికి జరిమానా



హెల్మెట్ లేని వాహనదారులకు జరిమానా విధిస్తున్న ట్రాఫిక్ పోలీసులు

రాయచూరు, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనదారులకు ట్రాఫిక్ పోలీసులు రాజ్యోత్సవం రోజున ఝులక్ ఇచ్చారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని ఇప్పటికే విస్తృత ప్రచారం చేసిన పోలీసులు దాన్ని నవంబరు 1వ తేదీ నుంచి అమలు చేస్తామని ఇప్పటికే స్పష్టం చేశారు. అయినా వాహనదారులేవ్వరు ఖాతరు చేయకుండా ఎదావిధిగా హెల్మెట్ లేకుండానే రోడ్లపైకి రావడంతో తొలి రోజు శుక్రవారం ట్రాఫిక్ పోలీసులు తమ ప్రతాపమ్ చూపారు. జిల్లా కేంద్రం రాయచూరు నగరంలోని పలు రోడ్డు కూడళ్ల వద్ద తిష్ట వేసిన ట్రాఫిక్ పోలీసులు హెల్మెట్ లేకుండా రోడ్డు పైకొచ్చిన ద్విచక్ర వాహనాలను అడ్డుకుని వారికి పెద్ద సంఖ్యలో జరిమానాలు విధించారు. దీంతో కొంతమంది వాహనదారులు ఈ తతంగాన్ని గమనించి సందుల్లో నుంచి తప్పించుకుపోగా మరికొందరు అనివార్యంగా పోలీసులు చేతికి చిక్కి జరిమానాలు చెల్లించుకున్నారు. ఈ క్రమంలో కొంతమంది వాహనదారులు పోలీసులతో వాగ్వాదానికి దిగిన సంఘటనలు చోటుచేసుకోగా పోలీసులు వారికి శృతిమెత్తగానే హెచ్చరికలు జారీ చేశారు. తాము వారం రోజుల క్రితం నుంచే ప్రచారం చేశామని సోషల్ మీడియాలోను పోస్టింగ్‌లు పెట్టడంతో పాటు ప్రత్యేక వాహనాల్లో మైకుల ద్వార ప్రచారం చేసినా పట్టించుకోకుండా రోడ్ల పైకి హెల్మెట్ లేకుండా రావడం నిబంధనల ఉల్లంఘననేనని స్పష్టం చేస్తున్నారు. కాగా తొలి రోజు శుక్రవారం దాదాపు నగర పరిధిలో 50కి పైగా కేసులు నమోదు చేసి వారి పై జరిమానాలు విధించినట్లు ట్రాఫిక్ పోలీసులు తెలిపారు.



రాజ్యోత్సవాన్ని ప్రారంభిస్తున్న మంత్రి కృష్ణబైరేగౌడ, ఎమ్మెల్యే నారా భరత్‌రెడ్డి



రాయచూరులో ప్రసంగిస్తున్న మంత్రి శరణ ప్రకాశ్ పాటిల్

కన్నడ అభివృద్ధి అందరి బాధ్యత

● రాజ్యోత్సవంలో మంత్రి కృష్ణబైరేగౌడ



బళ్లారి/గాంధీనగర్/రాయచూరు నవంబరు 1(ఆంధ్రజ్యోతి): దేశంలో సాహిత్యం, సంస్కృతికి, సంప్రదాయలను కాపాడుతూ వాటికి ప్రాతినిథ్య వహిస్తున్న కన్నడ భాషను అభివృద్ధి చేయడంతో అందరూ ఏకం కావాలని దేవాదాయ శాఖామంత్రి కృష్ణబైరేగౌడ పిలుపునిచ్చారు. శుక్రవారం జిల్లా యంత్రాంగం తరపున డాక్టర్ రాజ్‌కుమార్ రోడ్డు ప్రభుత్వ మున్సిపల్ కళాశాల మైదానంలో ఏర్పాటు చేసిన 69వ కర్నాటక రాజ్యోత్సవం కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజ్యాంగం ప్రకారం ఏ భాష శ్రేష్ఠమైనది లేదా తక్కువ కాదని అన్ని భాషలను సమానంగా గౌరవించాలన్నారు. కన్నడ భాషను విస్మరించే ప్రయత్నాల పట్ల అందరమూ అప్రమత్తంగా ఉండాలని పిలుపునిచ్చారు. కన్నడ మాట్లాడే ప్రాంతాలన్నింటినీ ఏకం చేస్తూ 1956 మైసూరు రాష్ట్రం ఆవిర్భవించిందని, 1973 నవంబరు 1న మైసూరు రాష్ట్రం అధికారికంగా 'కర్నాటక'గా ఏర్పడిందన్నారు. కర్ణాటకను ఎందరో రాజులు పాలించారని, కన్నడ భాషకు గొప్ప చరిత్ర ఉందన్నారు. వైవిధ్యమైన చరిత్రకు కన్నడనాడు పేరొందిందన్నారు. బళ్లారి జిల్లాలో కన్నడ తెలుగు, ఉర్దూ భాషలు ప్రాచుర్యం పొందాయని, జిల్లాలో అన్ని సంస్కృతుల సమ్మేళనం ఉందనారు.

ఆకట్టుకున్న శకటాల ప్రదర్శన

కన్నడ రాజ్యోత్సవంలో రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ, విధానసౌధ, ఉద్యానవన శాఖ ఆధ్వర్యంలో పరిసర సంరక్షణ, సిటీ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శకటాల ప్రదర్శన ఆకట్టుకుంది. ఈ సందర్భంగా సిటీ ఎమ్మెల్యే నారా భరత్ రెడ్డి, బాబా జగ్జీవన్ రామ్ చర్మ పారిశ్రామిక మండలి అధ్యక్షుడు ముండరిగి నాగరాజు, మేయర్ ముల్లంగి నందీష్, ఉప మేయర్ సుకం, బళ్లారి విభాగం ఐజి బి.ఎస్.లోకేష్ కుమార్, జిల్లాధికారి ప్రశాంత్ కుమార్ మిశ్రా, ఎస్పీ డాక్టర్ శోభారాణి, జిల్లా పంచాయతీ సిఇఓ రాహుల్ శరణప్ప సంకనూరు, జిల్లా సహాయాధికారి మహ్మద్ ఝుబేరాలతో పాటు పలువురు అధికారులు, వివిధ కన్నడ సంస్థల పదాధికారులు, కన్నడ అభిమానులు పాల్గొన్నారు.

చారిత్రక విశేషాలకు ప్రతీక రాయచూరు

చారిత్రక విశేషాలతో రాయచూరు జిల్లా చారిత్రకంగా ప్రత్యేకతను సంతరించుకుందని రాయచూరు జిల్లా ఇంచార్జ్ మంత్రి డా.శరణప్రకాశ్ పాటీల్ అన్నారు. 69వ రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని నగరంలోని మహాత్మగాంధీ క్రీడా మైదానం వద్ద కన్నడ నాడు జాతీయ జెండాను ఎగరవేసి ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడిన ఆయన కన్నడ నాడు అన్నది కేవలం భౌగోళిక సరిహద్దు మాత్రమే కాదని సంస్కృతి సంప్రదాయాలు భాష ఔన్నత్యానికి ప్రతీక అన్నారు.

పటేల్, ఇందిరా గాంధీకి నివాళి



నివాళి అర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

బళ్లారి సిటీ, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): ఉక్కుమనిషిగా పేరొందిన దేశ తొలి హోంమంత్రి, సర్దార్ వల్లభాయ్ పటేల్ 150వ జయంతి సందర్భంగా, దేశ తొలి మహిళా ప్రధాని వీర వనిత ఇందిరాగాంధీ 39 వర్ధంతిని గురువారం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. దేశానికి, పార్టీకి వారు చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు. ఈసందర్భంగా కేపీసీసీ సభ్యులు మారెన్న, మహమ్మద్ గౌస్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ విష్ణు బోయపాటి, కమిటీ చైర్మన్ వెంకటేశ్‌హెగ్డె, జిల్లా హామి పథకం అనుష్టాన కమిటీ చైర్మన్ చిదానందప్ప, కార్యదర్శులు ఈరన్నగౌడ, శ్రీనివాసులు, అలివేలు, మంజునాథ్, షేక్ అఫాక్ హుస్సేన్, ధనుంజయ్, మల్లీశ్వరి, గాదిలింగప్ప,లింగరాజు, అత్తావుల్లా, గంగాధర,సునీత, పద్మ, చందు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అభివృద్ధే శ్రీరామ రక్ష : మంత్రి



ప్రచారంలో మంత్రి సంతోష్‌లాడ్, ఎంపీ తుకారామ్

కంప్లి, నవంబరు 1(ఆంధ్రజ్యోతి) : సండూరు నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ విజయానికి తమ అభివృద్ధి కార్యక్రమాలే తమను గెలిపిస్తాయని మంత్రి సంతోష్ లాడ్, ఎంపీ తుకారామ్ ధీమా వ్యక్తం చేశారు. ఉప ఎన్నికల సందర్భంగా అభ్యర్థి అన్నపూర్ణ గెలుపు కోసం శుక్రవారం సండూరు నియోజకవర్గంలో జోరుగా ప్రచారాలు చేపడుతున్నారు. ఈ సందర్భంగా మంత్రి సంతోష్ లాడ్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వ పథకాల ద్వారా పేదలకు మేలు జరిగిందన్నారు. సండూరు నియోజకవర్గంలో నాలుగుసార్లు కాంగ్రెస్ ఎమ్మెల్యే తుకారామ్ గెలిచారని, రానున్న కాలంలో కూడా ఈ నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేపట్టి ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతారని తెలిపారు.

సంబరంగా దీపావళి



కంప్లి షుగర్ ఫ్యాక్టరీలో పూజలందుకుంటున్న కాళికాదేవి



అలంకరణలో బుక్కసాగర ఏడు పడగల నాగప్ప



దీపాలు వెలిగిస్తున్న యువతి

కంప్లి/తోరణగల్లు/రాయచూరు, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : దీపావళి పండుగను ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. దుకాణాలు, ఇళ్లల్లో లక్ష్మీదేవి పూజలు నిర్వహించుకున్నారు. పూలు, పండ్లతోను అమ్మవారి పూజలు చేపట్టి పూజలు నిర్వహించారు. టపాసులు కాలుస్తూ సంబరాలు జరుపుకున్నారు.

ఆలయాల్లో ప్రత్యేక పూజలు

తాలుకా పరిధిలోని పలు గ్రామాల్లో గురువారం అమావాస్య సందర్భంగా ప్రత్యేక పూజలు జరిగాయి. షుగర్ ప్యాక్టరీలోని కాళికాదేవి ఆలయంలో, సన్నాపురం వీరభద్రేశ్వరాలయం, ఎమ్మిగనూరు జడే సిద్దేశ్వర, కురుగోడు దొడ్డ బసవేశ్వరస్వామి ఆలయాల్లో, కుడితిని ఆంజనేయస్వామి ఆలయం, బుక్కసాగర వద్ద గల ఏళుపడగల నాగప్ప తదితర ఆలయాల్లో పండుగ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి దర్శనానికి భక్తులు పోటెత్తారు. అర్చకులు, పండితులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

4న జాబ్‌మేళా

నార్పల, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఎంప్లాయిమెంట్ ఎక్స్ఛేంజ్, సీడప్, డీఆర్‌డీఎ సంయుక్తంగా 4వ తేదీన జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు అనంతపురం జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి పీవీ ప్రతాప్ రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. హెచ్‌డీఎఫ్‌సీ లైఫ్, హీల్‌షై ఫ్యామిలీ హెల్త్ కేర్ కంపెనీ వారు పాల్గొంటారు. పది, ఇంటర్, ఐటీఐ, డిగ్రీ పాస్, ఫెయిల్ అయిన అభ్యర్థులు, 18 నుంచి 45 సంవత్సరాలలోపు యువతీ, యువకులు పాల్గొనవచ్చన్నారు. వివరాల కోరకు 9010039901 నంబరును సంప్రదించాలన్నారు.

హోసూరు జోన్

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులు



విద్యార్థులను అభినందిస్తున్న కోచ్

హోసూరు నవంబరు 1(ఆంధ్రజ్యోతి): తమిళనాడు వాలీబాల్ అసోసియేషన్, వేలూరు వాలీబాల్ అసోసియేషన్ సంయుక్తంగా నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి వాలీబాల్ చాంపియన్‌షిప్ వేలూరులో ఈ నెల 2నుంచి 5వరకు జరగనున్నాయి. వేలూరు రాష్ట్రస్థాయి అండర్-21 విభాగంలో పురుషులు, మహిళల కోసం పోటీలు జరగనున్నాయి. టోర్నీకి కృష్ణగిరి జిల్లా వాలీబాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన వాలీబాల్ పోటీల్లో జిల్లాస్థాయిలో రాణించి రాష్ట్రస్థాయికి ఎంపికైన విద్యార్థులను శుక్రవారం ప్రత్యేకంగా అభినందించారు. హోసూరులో కోచ్ మాణిక్యవాసగం శిక్షణ పొందిన బాలికలు కీర్తన, విద్య, శక్తి, కిరణ్, శాలిని ప్రియ, వినోదిని, యామిని, నవనీత, ధనలక్ష్మి వీరిని కృష్ణగిరి జిల్లా వాలీబాల్ అసోసియేషన్ సభ్యులు అభినందించారు.

భూపరిహార సమస్యలను పరిష్కరిస్తాం

సబ్ కలెక్టర్ ప్రియాంక

హోసూరు, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): రైతుల భూపరిహార సమస్యలను త్వరలో పరిష్కరిస్తామని సబ్ సభ కలెక్టర్ ప్రియాంక హామీ ఇచ్చారు. శుక్రవారం భూ పరిహార సమస్యలపై ప్రత్యేక సమావేశం జరిగింది. హోసూరు సబ్ కలెక్టర్ కార్యాయలంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎంపీ తంబిదురై, ఎంపీ గోపినాథ్ ఆధ్వర్యంలో రైతులతో ప్రత్యేక సమావేశం జరిగింది. సబ్ కలెక్టర్ ప్రియాంక అధ్యక్షత వహించారు. తమిళనాడు సరిహద్దులోని హోసూరు మీదుగా కర్నాటకకు 44 కిలోమీటర్ల శాటిలైట్ టౌన్ రింగ్‌రోడ్డును నిర్మిస్తున్నారు, జాతీయరహదారుల శాఖ గణాంకాల మేరకు 10.850 కి.మీల మేర సర్వీస్ రోడ్డు మాత్రమే నిర్మించనున్నారు. అయితే హోసూరు ప్రాంతంలో 44 కి.మీ సర్వీస్ రోడ్డు నిర్మించాలని రైతులు కోరుతున్నారు. టౌన్ రింగ్ రోడ్డు కోసం భూములిచ్చిన కర్నాటక ప్రాంత రైతులకు పరిహారంగా కోట్లాది రూపాయలు ఉంది. అయితే పట్టణంలోని రింగురోడ్డుపై ఉన్న తమిళనాడులోని హోసూరు ప్రాంతానికి చెందిన రైతులకు పరిహారంగా లక్షల్లో అందిస్తున్నారు. పరిహారం ప్రకటించడంలో జరిగిన అన్యాయాన్ని సరిచేయాలని హోసూరు ప్రాంత రైతులు డిమాండ్ చేస్తున్నారు. కర్నాటక రాష్ట్రం తరహాలో మార్కెట్ ధర ఆధారంగా నష్టపరిహారం చెల్లించాలని రైతులు డిమాండ్ చేశారు. 'జాతీయ రహదారుల శాఖ అధికారులు స్పందిస్తూ కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి రైతులకు న్యాయం కల్పించే హామీ ఇచ్చారు.

అనంతను కరువు జిల్లాగా ప్రకటించాలి

శింగనమల నవంబరు 1(ఆంధ్రజ్యోతి): అనంతపురం జిల్లాను కరువు జిల్లాగా ప్రకటించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి జాఫర్ డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక రామస్వామి దేవాలయంలో సీపీఐ మండల మహాసభలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జిల్లాలో 31 మండలాలు కరువుతో అల్లాడుతుంటే, కేవలం 7 మండలాలను కరువు మండలాలుగా ప్రభుత్వం ప్రకటించడం అన్యాయమన్నారు. జిల్లా నాయకులు పాణ్యం నారాయణ, కత్తినారాయణస్వామి, చెన్నప్పయాదవ్, రామాంజనేయులు, మధు, నేసే మధు పాల్గొన్నారు. అనంతరం మండల నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. కార్యదర్శి చిన్నప్ప యాదవ్, 15 మంది సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.



మాట్లాడుతున్న జాఫర్

కన్నడ పతాక రెపరెపలు

కన్నడ రాజ్యోతవ్సవం సందర్భంగా ఉభయ జిల్లాల్లో సంబరాలు ఘనంగా జరుపుకున్నారు. పాఠశాలలు, కార్యాలయాలు, గ్రామాలు, పట్టణాల్లో కన్నడ పతాకం ఎగురవేసి అభిమానాన్ని చాటుకున్నారు. రాజకీయ నేతలు, కన్నడ సంఘాల నాయకులు, ప్రముఖులు సంబరాల్లో పాల్గొన్నారు.

- ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్



మొక్క నాటి వేడుకలు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జనార్దన్ రెడ్డి



కంప్లిలో కరవే ఆధ్వర్యంలో..



బళ్లారి వాణిజ్య పరిశ్రమ శాఖలో ...



తోరణగల్లులో..



రవాణా శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శకటం



రాఘవ కళామందిరంలో



శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలో



కన్నడ మాత భువనేశ్వరి ఊరేగింపు



రాయచూరులో పురస్కార గ్రహీతలు

ప్రమాదాల నివారణకు సహకరించాలి

● మంత్రి డాక్టర్ శరణ ప్రకాశ్ పాటిల్

రాయచూరు, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదాల నియంత్రణ కోసం ప్రజలు ముఖ్యంగా వాహనదారులు పూర్తిగా సహకరించాలని జిల్లా ఇంచార్జ్ మంత్రి డాక్టర్ శరణ ప్రకాశ్ పాటిల్ కోరారు. జిల్లా ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో చేపట్టిన ఖచ్చితంగా హెల్మెట్ ధరించాలన్న ప్రచారానికి మంత్రి శుక్రవారం లాంచనంగా ప్రారంభించారు. రాజ్యోత్సవంలో పాల్గొనేందుకు వచ్చిన మంత్రి, ట్రాఫిక్ పోలీసుల కోరిక మేరకు ప్రమాదాల నివారణ కోసం చేపట్టిన తప్పనిసరి హెల్మెట్ ధారణ ప్రచారాన్ని లాంచనంగా ప్రారంభించి వాహనదారులనుద్దేశించి మాట్లాడారు. గత కొంతకాలంగా జిల్లా పరిధిలో పలు రోడ్డు ప్రమాదాల్లో ద్విచక్రవాహనదారులు ముఖ్యంగా హెల్మెట్ లేకుండా ప్రయాణిస్తున్న వారు మృత్యువాతపడడాన్ని మంత్రి ప్రస్తావించారు. ఇలాంటి ప్రమాదాలను నివారించడమే లక్ష్యంగా పోలీసులు హెల్మెట్‌ను ధరించడం తప్పనిసరి చేశారని ఈ విషయంలో వాహనదారులు వాస్తవాన్ని అర్థం చేసుకుని పోలీసులకు సహకరించాలన్నారు. ఈ సందర్భంగా కొంతమంది దివ్యాంగులకు,మహిళలకు మంత్రి చేతుల మీదుగా ఉచితంగా హెల్మెట్‌లు అందజేశారు.